

# శ్రీ హనుమత్ జ్ఞానపుష్పాలు



సంపుటి - 1 **డిజిటల్ మాస పత్రిక** సంచిక - 3

**శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల జీవన స్వీయజ్ఞాన కరదీపిక**



**శ్రీ గురుధాం ధర్మక్షేత్రం**

**ఆగస్టు 2026**

**శ్రీ శివానందగురు ఎడ్యుకేషనల్ & కల్చరల్ ట్రస్ట్ - బలుసుపాడు**

# శ్రీ హనుమత్ జ్ఞానపుష్పాలు

సంపుటి-1 డిజిటల్ మాసపత్రిక - ఆగస్టు 2026 సంచిక - 3

శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల జీవన స్వీయజ్ఞాన కరదీపిక

ప్రకాశకులు : శ్రీ శివానందగురుఎడ్యుకేషనల్ & కల్చరల్ ట్రస్ట్

శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం, బలుసుపాడు, జగ్గయ్యపేట (మం), ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు : శ్రీ గెంటేల ఆనంద శంకర్, శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం, బలుసుపాడు


**ఓంనమో - భగవతే - శ్రీశివానందాయ**

**శ్రీహనుమ జయహనుమ శివానంద హనుమ**

## ఈ సంచికలో....


| | |
|---|---|
| పురుషార్థసాధకం.... శ్రీగురుధామం!! | 3 |
| సందేహ నివారణ | 4 |
| అమృత గుళికలు - ఆధ్యాత్మిక రత్నాలు | 5 |
| విచారణా స్రవంతి - ఉన్నది పూర్ణానుభవమే | 6 |
| కృష్ణ తత్వము - ఆత్మసాక్షాత్కార మార్గము | 8 |
| తాళం లేని తలుపు - వెళ్లడానికి ఇష్టపడని బాలుడు | 11 |
| The Door That Was Never Locked - The Boy Who Would Not Leave | 15 |
| దైవభక్తి... దేశభక్తి...సనాతన ధర్మానికి రెండు కళ్లు | 19 |
| పురచరిత్రకు పద్యనీరాజనం | 24 |
| గురుకుటుంబ ఉత్సవం.... గురుపౌర్ణమి పర్వదినం! | 25 |
| గ్రామదేవతలకు సామూహిక జలబిందెల సమర్పణ | 26 |
| సేవా కార్యక్రమాలతో గురుదేవుల జన్మదినోత్సవం | 27 |
| శివశ్రీ రమణ గురుదేవుల జన్మదిన సందేశం | 28 |
| నిద్రకీ.... జ్ఞానానికీ.... తేడాఏమిటి? | 32 |
| 'జ్ఞాపకం'.... 'కోరిక'లే పెద్ద విఘ్నం | 34 |
| భారం పోవటమే మనసు పోవటం | 38 |
| ఆధ్యాత్మికతకు క్రమత.... క్రమశిక్షణ....అవసరమా? | 40 |
| వైరాగ్యము, చిత్తశుద్ధి మరియు ఆత్మవిచారము | 44 |


**కళ్లు మూస్తే దైవాన్ని స్మరించు - కళ్ళు తెరిస్తే దేశాన్ని సేవించు**


FOR PRIVATE CIRCULATION ONLY

# పురుషార్ధసాధకం.... శ్రీగురుధామం!!

**మా**నవ జీవితానికి అర్థాన్ని, పరమార్థాన్ని కల్పించేందుకు మన భారతీయ సనాతన ధర్మం నిర్దేశించిన సోపానాలే.... చతుర్విధ పురుషార్థాలు. ధర్మం, అర్థం, కామం, మోక్షాలనే పురుషార్థాలకు సంపూర్ణ సాఫల్య కేంద్రమే శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం. మనిషి జీవనానికి అవసరమైన అర్థకామాలు ఎప్పుడూ ధర్మమోక్షాల నడుమ ఉండాలన్నదే సద్గురు శ్రీశివానందమూర్తి భగవానుల వారి సందేశం. ఆ ఉపదేశానికి సాకారరూపంగా కనిపించే శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవులు ఇక్కడి గురుకుటుంబం మొత్తాన్ని అదే మార్గంలో నడిపిస్తూ మార్గదర్శకులవు తున్నారు. ధర్మాన్నే పరమార్థంగా కామించడమే మోక్షమని సెలవిచ్చే శివశ్రీ రమణ గురుదేవులు తమ బోధల్లోనే కాక నిత్య కార్యాచరణలోనూ అదే దివ్యత్వాన్ని అనుసరిస్తారు. శ్రీగురుధామ్ ధర్మక్షేత్రంలో జరిగే నిత్య కార్యకలాపాల్లోనూ, విశేష కార్యక్రమాల్లోనూ అంతర్గతంగా మోక్షేచ్ఛ స్ఫురిస్తుంది. బాహ్యంగా ధర్మాచరణలు దర్శనమిస్తాయి. ఆ కారణం వల్లనే గురుకుటుంబంలోని భక్తుల అర్థకామాల్లోనూ పవిత్రత ఆవరించి ఉంటుంది. మనిషి జీవనానికి అర్థకామాలు ఎంత ముఖ్యమో, పరమోత్కృష్టమైన జ్ఞానానికి ధర్మమోక్షాలు అంత అవసరమని నిరంతరం గుర్తుచేసే గురుబోధ అనుక్షణం ప్రతి హృదయంలో ఇక్కడ మారోగుతూ ఉంటుంది. వర్గ, వయో, లింగభేదాలు మాత్రమేకాక మతాలకు అతీతంగా ధర్మమే ఇక్కడ అందరి అభిమతంగా ప్రస్ఫుటమౌతుంది. నిత్యం వచ్చే గురుకుటుంబ భక్తులకే కాక తమతమ అవసరాలు, కష్టాలు, బాధలకు పరిష్కారం కోసం వచ్చే ఉన్నత ఉద్యోగ, వ్యాపార, హోదాల్లో ఉన్నవారు, అనామకమైన సామాన్యులు అందరికీ ఒకే రకమైన శాంతిని పంచే శ్రీగురుధామం జీవన్ముక్తి అంటే ఏమిటో ప్రతి ఒక్కరికీ చవిచూపుతుంది. ఏ పటాటోపంలేని కార్యక్రమాలు, ప్రేమానురాగాలతో కూడిన ఆత్మీయత, సంస్కార వంతమైన ఆప్యాయతలు ఆధ్యాత్మికతలోని మాధుర్యాన్ని ప్రతిఒక్కరికీ చవి చూపి స్తాయి. ఆధ్యాత్మిక జీవనం , లౌకిక జీవనం అంటూ విభజనలేని పవిత్రజీవనమే పారమార్థిక జీవనం అని భోదించే శివశ్రీ రమణ గురుదేవుల ప్రవచనాలతో పులకించే హృదయాలు పురుషార్థాలకు ప్రత్యక్ష తార్కాణాలుగా నిలుస్తాయి.

# సృష్టిగా మారినా... ఆత్మ చైతన్యంలో ఏ మార్పు ఉండదు.

## ప్రశ్న : ఆలోచనలతో నిండి ఉండే మనసుకి ఆత్మ ఎలా తెలుస్తుంది?

**శివశ్రీ రమణ గురుదేవులు :** ఒక కళాకారుడు మట్టితో అందమైన వినాయకుడి బొమ్మను తయారు చేస్తున్నాడు. అతను తన చేతిలోకి కొద్దికొద్దిగా మట్టిని తీసుకుంటూ దాన్నే తొండముగా, దంతాలుగా, చేతులుగా, చేతిలో ఉండ్రాళ్లుగా, స్వామి ముందు కూర్చునే ఎలుక వాహనంగా మార్చి ఆ బొమ్మను రూపొందించాడు. ఇంతలో అతనికి స్వామి వారి రూపంలో ఏవో చిన్న చిన్న మార్పులు చేయాలని పించింది. మట్టిలో తాను కోరుకున్న ఆకారాలు వచ్చే విధంగా సరిచేశాడు. మనం బాగా పరిశీలిస్తే అతను చేసిన బొమ్మలకు రంగులు అద్ది ప్రదర్శనకోసం పెట్టిన తర్వాత అవి విభిన్నమైన రూపాల్లో కనిపిస్తున్నాయి కానీ... అవన్నీ అదే మట్టితోనే తయారయ్యాయి. అతను తయారుచేసేప్పుడూ, సరిచేసేప్పుడూ మట్టిలో ఆకారాలు మారుస్తున్నాడు కానీ మట్టిని ఏమీ మార్చడం లేదు. మట్టిలో ఏ మార్పు లేకుండానే అన్నిరకాల రూపాలు ఎలా రూపుదిద్దుకున్నాయో మనలోని ఆత్మచైతన్యమైన ఎరుక జీవనం కోసం మనసుగా వ్యవహరిస్తూ కనిపిస్తున్నా దాని మూలపదార్థమైన ఆత్మచైతన్యంలో ఏ మార్పు లేదు. మార్పు చెందని ఆ ఆత్మచైతన్యం మనలో నిరంతర ధ్యానంగా ఉంది. మట్టితో వివిధ ఆకారాల్లో బొమ్మలు తయారయ్యాయే కానీ మట్టిలో ఏ మార్పు లేదు. ఇప్పుడు మన సందేహం ఏమంటే... నిర్గుణం, నిర్మలమైన ఈ ఆత్మచైతన్యం మనసుగా వ్యక్తమైనప్పుడు ఆలోచనలు, జ్ఞాపకాలు, అనుభవాలు, అనుభూతులు, భావోద్వేగాలుగా కనిపిస్తుంది కదా! దాంతో ఆత్మ ఎలా తెలుస్తుంది? అని. మనసుకు ఏర్పడిన గుణాలన్నీ జీవన ప్రక్రియలో భాగం. అవి లేకపోతే జీవనం సాగదు. కానీ దాని మూలపదార్థమైన ఎరుకలో ఏ మార్పూ లేదు. మట్టియొక్క ధర్మాన్ని, తాను చేసే బొమ్మ రూపాన్ని అవగాహన చేసుకున్న శిల్పి మార్పుచెందని మట్టితో విభిన్న రూపాలు తయారు చేయడంలో నైపుణ్యం సంపాదించాడు. అలానే మనసుగురించి, మనసుగా మారిన ఆత్మ చైతన్యం గురించి అవగాహన చేసుకుంటే విభిన్నగుణాలతో కనిపించే మనసు నిర్గుణమైన ఆత్మకు ప్రతిరూపమేనని తెలుస్తుంది.

## అమృత గుళికలు - ఆధ్యాత్మిక రత్నాలు

### శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల హనుమత్ జ్ఞాన పుష్పాలు

- మనసు సమాధానపడితే తాత్కాలిక సంతోషం
  తానే సమాధానంగా మారితే శాశ్వతమైన ఆనందం.
- సుఖసంతోషాల్లో మరుగున పడ్డ 'నేను' మళ్లీమళ్లీ పుడుతుంది.
  అవగాహనలో కరిగిపోయిన 'నేను' ఆనందంగా పరిణమిస్తుంది.
- జ్ఞానం అంటే మనసు కేవల ప్రజ్ఞగా మిగలడం,
  ధ్యానం అంటే నిరంతరం వర్తమానంలో ఉండటం.
- అహం బ్రహ్మాస్మి అనేది, అనేది అనుకునేది కాదు,
  ఏదీ అనుకోకుండా అదిగా అయి ఉండేది.
- ఆదిభిక్షువు అంటే... ఏమీలేనివాడు కాదు,
  ఏదీ అడుక్కోవాల్సిన అవసరం లేకుండా చేసేవాడు.
- తెలియని ఆత్మకోసం వెతకడం అశాంతిని పెంచుతుంది,
  తెలిసిన శాంతిని కాపాడుకుంటే ఆత్మగా ఉంచుతుంది.
- ఆత్మ అంటే తెలియనిదనుకొని వెతుకుతుంటే,
  సిద్ధంగా ఉన్న శాంతి తెలియకుండా పోతుంది.
- ఆలోచనల్లో అర్థంకానిదాన్ని అంతరంగంలో అన్వేషిస్తే దొరకదు,
  ఆలోచనల అంతరార్థం అవగాహన అయితే పరమార్థం గోచరిస్తుంది.
- అహంకారం వచ్చిచేరిందే కానీ ఆత్మలో ఉన్నది కాదని అర్థమైతే,
  అశాంతికి కారణమైన అజ్ఞానం సమూలంగా అదృశ్యమౌతుంది
- బాహ్యంలో ఉండి మనసులో లేకుండా పోతే జ్ఞానం,
  బాహ్యంలో లేనిది మనసులో ఉన్నట్లనిపిస్తే అజ్ఞానం.
- అపార్థమే భ్రమ! అజ్ఞానం!
  అర్థమైతే ఉండేది బ్రహ్మజ్ఞానం!!

# ఉన్నది పూర్ణానుభవమే

## జ్ఞానము... ఆత్మానుభవము అంటే ఏమిటి?

**మ**నకున్న మూడు అవస్థల్లో... జాగ్రదవస్థలో మనసు బలంగా పూర్ణంగా ఉంటుంది. స్వప్న అవస్థలో మనసు పలుచగా ఉంటుంది. సుషుప్తి అవస్థలో మనసు ఉండదు (తెలియదు). కానీ సుషుప్తి అవస్థలోని శాంతి అనుభవం బలంగా ఉంటుంది. స్వప్నంలో కలల అనుభవం పలుచగా ఉన్నా మనసు బలంగా నమ్ము తుంది. కానీ జాగ్రదవస్తలో జరిగే అనుభవం బలంగా ఉన్నా ఆలోచనల చేత అది పలుచగా కనబడుతుంది. అనుభవం విషయంలో ఉన్న ఈ వ్యత్యాసాన్ని మనం గమనించము. కారణం... జాగ్రదవస్థలో ఆలోచనలో, ఊహలో, ధ్యానంలో ఉన్న ఒక దైవ రూపం మనకి అనుభవంగా అనిపించదు. ఊహగా, ఆలోచనగానే భావిస్తాం. అదే రూపం స్వప్నంలో కనిపిస్తే ఆలోచనగా కాక అనుభవంగా భావిస్తాం. సుషుప్తిలో రూప నామాలు లేని స్థితి ఆత్మ దర్శనంగానే ఉంటుంది. కానీ మనసు (ఇంకేదో ఉందన్న ఆలోచన) వాటిని అలా స్వీకరించనివ్వదు. రూపనామ రహిత మైనది సంపూర్ణమైన ఆత్మ దర్శనం విషయంలో కానీ. రూప నామ సహితంగా ఉన్న పాక్షికమైన బాహ్యదర్శనం విషయంలోకానీ అనుభవంలో ఆలోచన (మనసు) కూడి ఉన్నప్పుడు... మనసుకు ఇది జాగ్రదనుభవము, ఇది స్వప్న అనుభవము, ఇది సుషుప్తి అనుభవము అనే విభజన వస్తుంది. మనకి మనసు ప్రస్ఫుటంగా కనబడేది జాగృదావస్థ. కానీ ఆలోచనలతో మిళితమై ఉన్న కారణంగా.... అక్కడ జరిగే అనుభవాన్ని ఆలోచనలో భాగంగానే భావిస్తుంది. స్వప్నంలో అనుభవమైనా అది సంపూర్ణ అనుభవంగా భావించక స్వప్న అనుభవంగానే స్వీకరిస్తుంది. సుషుప్తిలో కలిగే ఆత్మ అనుభవాన్ని నిద్ర అనుభవమనే అంటుంది. ఈ మూడు రకాలుగా అనేది జాగృతంలోని మనసే. మనసే సహజంగా ఉన్న ఆత్మ అనుభవాన్ని శుద్ధ ఎరుకను మూడు భాగాలుగా మారుస్తుంది. అదే జాగ్రత్ స్వప్న సుషుప్తి అవస్థలు.



ఉన్నది ఆత్మ అనుభవం ఒక్కటే. కానీ మూడు భాగాలు ఎందుకయింది అంటే ఆలోచన వల్ల. ఒకవేళ ఇప్పుడు ఊహలో ఆలోచనలో ఒక రూపం ఉండి ఈ భేదమనసు లేకపోతే అది ప్రత్యక్ష అనుభవమే. కానీ మనకు మనసు ఉన్న కారణంగా జ్ఞాపకం అలా అనిపించనివ్వదు. అనుభవం అదే అయినా పేరు పెట్టడంతో అది పలచబడింది. జాగృదావస్థలో అనుభవాలను మనసు ఇంద్రియ రూపాలుగానే భావిస్తుంది. ఆలోచన లేకపోతే కనిపించే ఆంజనేయస్వామి రూపం దర్శనంగా ఉంటుంది. ఆత్మానుభవం కూడా అలాంటిదే. ఇది జాగృతం, ఇది స్వప్నము, ఇది సుషుప్తి అని మనసు పేర్లు పెట్టి సహజమైన ఆత్మ అనుభవాన్ని, తృప్తిని కలగకుండా చేస్తుంది. అదే సమాధిలో అయితే మనసు ఉండదు కనుక జరిగే అనుభవాలు నిజమైన అనుభవాలుగా తృప్తినిస్తాయి. సహజంలో ఏది ఉందో సమాధిలోను అదే ఉంది కానీ మనసు రెచ్చగొట్టి ఇది అనుభవం కాదు అనే భావం కల్పిస్తుంది. జాగృతమైనా, స్వప్నమైనా సుషుప్తి అయినా, ఎదురుగా ఉన్నదైనా, ఊహలో ఉన్నదైనా, ఆలోచనలో ఉన్నదైనా అనుభవం అన్నివేళలా అనుభవమే. కానీ మనసు ఇది పాక్షికము, ఇది బలహీనము, ఇది సంపూర్ణము అని పేర్లు పెడుతుంది. వాస్తవానికి అలాంటి అసంపూర్ణమైన అనుభవమే లేదు. ఉన్నది పూర్ణానుభవమే!

## కృష్ణ తత్త్వము - ఆత్మసాక్షాత్కార మార్గము

# మెలుకువే పరమాత్మ జన్మదినం

(శివశ్రీ రమణగురుదేవుల కృష్ణాష్టమి సందేశం  ది.16.08.2025)

**మా**నవ జీవితంలో అత్యంత ప్రధానమైనది జ్ఞానోదయ స్థితి. పరమాత్మ జన్మదినం అనగానే మనకు కృష్ణాష్టమి, శ్రీరామనవమి, శివరాత్రి వంటి పండుగలు గుర్తుకొస్తాయి. కానీ, తత్వదృష్టితో ఆలోచిస్తే మనకు మెలుకువ వచ్చిన ప్రతి క్షణమూ ఒక సుప్రభాతమే; మన మెలుకువే పరమాత్మ జన్మదినం. జగత్తుతో, దేహంతో సంబంధం ఏర్పడే ఈ ఎరుకే (కాన్షస్‌నెస్) సకల పండుగలకు, సమస్త సాధనలకు మూలం. ఈ పరమ చైతన్యంలోనే త్రిగుణాలు, త్రిలోకాలు, త్రివిధ అవస్థలు అంతర్భాగమై ఉన్నాయి. కృష్ణ తత్త్వాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడం అంటే దేవుడి గురించి బాహ్యంగా తెలుసుకోవడం కాదు, మన యదార్థ స్వరూపమైన ఆత్మను ఆవిష్కరించుకోవడమే. "ప్రసంగం అంటేనేమో నీ గురించి చెప్పేది, ప్రవచనం అంటే దేవుడి గురించి చెప్పేది." బాహ్య ప్రపంచాన్ని చూసి ఆకర్షణ పొందడం సహజం. శవాన్ని చూస్తే వికర్షణ వస్తుంది కానీ ఆకర్షణ రాదు; శివాన్ని చూస్తేనే, లోపలి ఆత్మచైతన్యాన్ని దర్శిస్తేనే నిశ్చలమైన ఆకర్షణ సుసాధ్యమవుతుంది.

'కృష్ణ' అనే పదం ఒక భౌతిక రూపం మాత్రమే కాదు, అదొక పరమ తత్త్వం. ఆంగ్లంలో 'క్రిష్' అంటే ఆకర్షణ, 'న' అంటే అఖండమైన ఆనందం లేదా జ్ఞానం. ఆనందానికే మరొక పేరు ఆత్మ, ధ్యానం, మౌనం. ఆత్మ ప్రకాశమే ఆనందం. మన మనస్సు అనే ఇనుప పిన్నీసు ప్రస్తుతం బాహ్య ప్రపంచం వైపు ఆకర్షితమై ఉంది. విజ్ఞాన శాస్త్రంలో అయస్కాంతం వద్దకు ఇనుప వస్తువును తెచ్చినప్పుడు, అందులోని అణువులన్నీ ఒకే దిశగా క్రమబద్ధీకరించబడి ఆకర్షణ శక్తిని పొందుతాయి. అలాగే, అస్తవ్యస్తంగా ప్రపంచ విషయాల వైపు చెదిరిపోయిన మన మనస్సును, ఆత్మ అనబడే అయస్కాంతం వైపు ఏకోన్ముఖం చేయడమే ఆధ్యాత్మిక సాధన. మనస్సు బయటి వైపు వెళ్తే సంసారం, కోరికలు, బంధాలు ఏర్పడతాయి; అదే మనస్సు ఆత్మ వైపు మళ్లితే ఆత్మానందం, ముక్తి లభిస్తాయి. లోకంలో ప్రతి అందంలోనూ,



ప్రతి జీవిలోనూ వ్యక్తమయ్యే ఆకర్షణకు మూలం లోపల ఉన్న పరమాత్మ వస్తువే. "చీరలెత్తుకెళ్ళాడా చిన్ని కృష్ణుడు.. చిత్తమే దోచాడే చిలిపి కృష్ణుడు" అనే ఆచార్య ఆత్రేయ పాటలో గంభీరమైన వేదాంతార్థం ఉంది. కృష్ణుడు దోచుకున్నది గోపికల వస్త్రాలను కాదు, ప్రపంచం వైపు ఉన్న వారి చిత్తాన్ని (మనస్సును). మనస్సును తన వైపు తిప్పుకొని, ఆత్మస్థితిలో లయం చేయడమే కృష్ణ తత్త్వము.

మనం నిత్య వ్యవహారంలో 'వ్యక్తిత్వము' అనే పదాన్ని వాడుతుంటాం. వ్యక్తిత్వము అంటే వ్యక్తి ప్లస్ తత్వము. వేదాంతంలో దీనినే 'దేహాత్మ భావన' అంటారు. దేహమును (వ్యక్తిని) నేను అని అనుకోవడమే అజ్ఞానానికి మూలం. సద్గురువులు బోధించినట్లు – "నేను లేను" అని తెలుసుకోవడమే జ్ఞానము. "నేను లేను" అంటే శరీరం లేదని కాదు, నామరూపాలతో కూడిన ఈ దేహమే నేను అని భావించే 'కర్త' లేడు అని అర్థం. మాటలొచ్చినప్పటి నుండి "నేను ఫలానా తేదీన పుట్టాను" అని అనుకోవడం ఒక ఆపాదన. పుట్టినప్పుడు నీకు ఎరుక లేదు, ఎవరో చెబితే విజ్ఞానంతో తెలుసుకున్నావు. దేహానికి పూర్వం ఉన్న ఎరుకే నీ యదార్థ స్వరూపం. జన్మలన్నీ చైతన్యం నుండి ఉత్పన్నమైనవే. పంచభూతముల సారము, ప్రాణముల సంయోగం వల్ల కలిగే గుణమే ఈ చైతన్యము. శ్రీరాములు, శ్రీకృష్ణులు ఎంతమంది వచ్చి వెళ్లినా ఈ చైతన్య తత్వంలో మార్పు లేదు. కన్ను చూడటం, చెవి వినడం వంటి గ్రహణ శక్తులు ప్రాణసంబంధమైన చైతన్య లక్షణాలే తప్ప, యదార్థ ఆత్మ కాదు.

కృష్ణ భక్తి అంటే ఒక రూపాన్నో, నామాన్నో పట్టుకోవడం మాత్రమే కాదు. మెలుకువగా ఉన్నప్పుడు మనసు ఎంత సహజంగా ప్రపంచంతో సంబంధం పెట్టుకుంటుందో, అంత సునాయసంగా ప్రపంచం మీది ఆకర్షణను, మమకారాన్ని వదిలిపెట్టడమే నిజమైన భక్తి. దీనికి ఉదాహరణ మన నిద్ర. గాఢ నిద్రలోకి వెళ్లేటప్పుడు దేహాన్ని, బంధువులను, ప్రపంచాన్ని ఎంత తేలికగా, అప్రయత్నంగా వదిలిపెడుతున్నామో ఆలోచించండి! నిద్రలో ప్రపంచాన్ని వదిలిపెట్టడానికి కారణం – అక్కడ ఎరుక దేనినీ గట్టిగా పట్టుకోకపోవడమే. నిద్ర ఎంత సహజంగా, శ్రమ లేకుండా వస్తుందో, ఆత్మధ్యానం కూడా అంతే సహజమైనది. మనస్సు అనేది ఎరుకకు ఉన్న రెండో ముఖం. తండ్రి వేలు పట్టుకుని బజారుకు వెళ్లిన చిన్న పిల్లాడు అక్కడ బొమ్మను చూసి ఆకర్షితుడైనట్లు, ఎరుకతో వచ్చిన మనస్సు ప్రపంచ వస్తువులను పట్టుకుంటుంది. బఫే భోజనంలో మనకు ఇష్టమైన పదార్థం వైపు మనస్సు వెళ్తుంది, మిగిలిన వాటిని పట్టించుకోదు. అలా ప్రపంచంలోని విషయాలపై ఉన్న ఇష్టాపేక్షలను తృణప్రాయంగా వదిలివేస్తే, ధ్యానం కరతలామలకమవుతుంది.

పరమాత్మ జగద్గురువు. సమస్త ప్రకృతిలోను గురుతత్త్వమే నిండి ఉంది. పొలంలో రైతు విత్తనం వేసినప్పుడు పంటతో పాటు కలుపు మొక్కలు రావడం సహజం. రైతు కలుపును ఏరివేస్తేనే పంట ఏపుగా పెరుగుతుంది. అలాగే మన జీవితంలో జన్మజన్మల వాసనలు, కర్మలు అనే కలుపు మొక్కలు ఉంటాయి. సద్గురువుల అనుగ్రహంతో, సాధనతో ఆ కలుపును ఏరివేసినప్పుడు ఆత్మసస్య సమృద్ధి లభిస్తుంది. గురువు మరియు పరమాత్మ వేరు కాదు. బాహ్య ప్రపంచపు చీకటిలో జీవుడు కొట్టుమిట్టాడుతున్నప్పుడు, గురు కృప అనే వెలుగు మాత్రమే సరైన దారిని చూపిస్తుంది. అందుకే, “ఓం క్లీం కృష్ణాయ నమః” లేదా “కృష్ణ” అనే నామస్మరణ విశేషమైనది. ‘కృష్ణ’ అన్న ఒక్క పదంలోనే సమస్త బీజాక్షరాలైన క్లీం, శ్రీం, ఐం, హ్రీం లు అంతర్లీనంగా ఉన్నాయి. మన దేహాత్మ భావనను, నామరూపాల పట్ల ఉన్న వ్యామోహాన్ని పటాపంచలు చేసి, “నేను అనే కర్త లేదు, ఉన్నదంతా ఒక్కటే పరమ చైతన్యము” అనే పరమ సత్యాన్ని గ్రహించడమే నిజమైన జన్మాష్టమి సందేశం. లోపలి ఆత్మ చైతన్యాన్ని గుర్తించి, రాగద్వేషాలకు అతీతంగా, నిశ్చలమైన ఆనంద స్థితిలో నిలకడ చెందడమే మానవ జన్మకు అత్యున్నతమైన సార్థకత.

# తాళం లేని తలుపు -
# వెళ్లడానికి ఇష్టపడని బాలుడు

(స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆలోచన)

- గెంటేల ఆనంద శంకర్

**ఒ**క బాలుడు మూడు రోజులు ఒక తలుపు బయట కూర్చున్నాడు. ఆ తలుపు తెరుచుకోలేదు. అది అతని ఇల్లు కాదు. అక్కడ నివసించే దేవుడు ఇంట్లో లేడు....ఆ బాలుడి పేరు నచికేతుడు. తన తండ్రి చేస్తున్న ఒక యజ్ఞంతో ఈ కథ మొదలైంది. దాని పేరు విశ్వజిత్ యజ్ఞం. ఈ యజ్ఞం ఈ లోకంలోనూ, తర్వాతి లోకంలోనూ అన్నీ గెలవడానికి చేసేది. కానీ దీనికి ఒక నియమం ఉంది. యజ్ఞం చేసేవాడు తనకున్నదంతా దానం చేయాలి. ఏమీ మిగుల్చుకోకూడదు. నచికేతుడి తండ్రి ఈ ప్రతిజ్ఞ చేశాడు. కానీ దానం చేసే సమయం వచ్చేసరికి, అతను ముసలి ఆవులను దానం చేశాడు. ఆ ఆవులు పాలు ఇవ్వలేవు. పొలంలో పనిచేయలేవు. వాటికి ఇవ్వడానికి ఇంకేమీ మిగల్లేదు. నచికేతుడు ఇది చూశాడు. తన తండ్రి గురించి అతనికి దిగులు కలిగింది. అతను మళ్లీ మళ్లీ అడిగాడు, "నన్ను ఎవరికి దానం చేస్తావు?" తండ్రికి కోపం వచ్చింది. చివరికి ఆయన, "నిన్ను యముడికి ఇచ్చేస్తున్నాను" అని అన్నాడు. చాలామంది పిల్లలు ఇవి కేవలం కోపంతో అన్న మాటలు అనుకుంటారు. నచికేతుడు అలా అనుకోలేదు. అతను యముడిని వెతుక్కుంటూ వెళ్లాడు. యముడు ఇంట్లో లేడు. అందుకని నచికేతుడు అతని తలుపు బయట వేచి ఉన్నాడు. మూడు రోజులు వేచి ఉన్నాడు. అతనికి తిండి లేదు. ఎవరూ అతనితో మాట్లాడలేదు. పిలవకుండా లోపలికి వెళ్లడానికి అతను ఇష్టపడలేదు. అలాగే వెళ్లిపోవడానికి కూడా ఇష్టపడలేదు. యముడు ఇంటికి వచ్చాడు. ఏం జరిగిందో తెలుసుకున్నాడు. అతనికి బాధ కలిగింది. ఒక అతిథి తన తలుపు దగ్గర ఆకలితో ఉన్నాడు. ఇది ధర్మానికి విరుద్ధం. యముడు ఇంటి యజమాని, అతను ఈ బాధ్యతలో విఫలమయ్యాడు. అందుకని అతను బాలుడికి మూడు వరాలు ఇస్తానన్నాడు. బాలుడికి కావలసినది ఏదైనా సరే. దీనితో తప్పును సరిదిద్దుకోవచ్చు. నచికేతుడి మొదటి రెండు కోరికలు సామాన్యమైనవి. తన తండ్రికి

శాంతి కావాలని అడిగాడు. స్వర్గానికి తీసుకెళ్లే ఒక ప్రత్యేక యజ్ఞ విద్య నేర్చుకోవాలని అడిగాడు. యముడు రెండింటికీ వెంటనే ఒప్పుకున్నాడు. ఇవి చిన్న విషయాలు. తర్వాత మూడో కోరిక వచ్చింది. ఇది చిన్నది కాదు. చనిపోయాక మనిషికి ఏమవుతుందో నచికేతుడు తెలుసుకోవాలనుకున్నాడు. యముడు అతని మనసు మార్చడానికి ప్రయత్నించాడు. మొదట మృదువుగా చెప్పాడు. తర్వాత గట్టిగా చెప్పాడు. పది జన్మలకు సరిపడా ధనం ఇస్తానన్నాడు. ఒక రాజ్యం ఇస్తానన్నాడు. కొడుకులు, పశువులు, బంగారం, వంద సంవత్సరాల జీవితం ఇస్తానన్నాడు. లోకంలోని ఉత్తమ నర్తకీమణులను, గాయకులను ఇస్తానన్నాడు. "వేరే ఏదైనా అడుగు," అన్నాడు యముడు. "దేవతలకు కూడా ఈ ప్రశ్న పూర్తిగా అర్థం కాలేదు. నీ వరాన్ని దీనికి వాడకు." అన్నాడు. నచికేతుడు అన్నింటినీ కాదన్నాడు. అతను యముడితో, "ఇవన్నీ కాలంతో పాటు తరిగిపోతాయి. వంద సంవత్సరాలు కూడా ఇదే విధంగా ముగుస్తాయి. అది కేవలం ఇదే తలుపు దగ్గర ఇంకా ఎక్కువ కాలం వేచి ఉండటమే" అని అన్నాడు. ఈ సమాధానం యముడిని కదిలించింది. అతను బాలుడిని పరీక్షించడం ఆపేశాడు. అతనికి బోధించడం మొదలుపెట్టాడు.

"ప్రతి మనిషికి రెండు మార్గాలు ఉంటాయి," అన్నాడు. "ఒకటి ఇష్టమైన మార్గం. రెండోది మంచి మార్గం. చాలామంది ఇష్టమైన మార్గాన్ని ఎంచుకుంటారు. అది పెద్ద శబ్దంతో, తేలికగా కనిపిస్తుంది. మంచి మార్గం నిశ్శబ్దంగా ఉంటుంది. దానిని కనుక్కోవడానికి కృషి చేయాలి." తర్వాత నచికేతుడు కోరుకున్న సమాధానం చెప్పాడు. ప్రతిమనిషిలో ఒకటి ఉంటుంది అన్నాడు. అది ఎప్పుడూ పుట్టదు,ఎప్పుడూ చావదు. దానిని చూడలేము, తాకలేము. మనం "నేను" అని పిలిచే ప్రతిదానిలోపల అది నిశ్శబ్దంగా ఉంటుంది. అని చెప్పాడు. ఈ కథ గురించి ఆలోచించినప్పుడల్లా, మొదట నాకు అందులో ధైర్యం కనిపిస్తుంది. లంచం తీసుకోని ఒక బాలుడు. కానీ ఇప్పుడు నన్ను ఆలోచింపజేసేది అంతకన్నా చిన్న విషయం. యముడు నచికేతుడికి తప్పించుకునే దారిని మళ్లీ మళ్లీ చూపించాడు. ప్రతిసారీ, అది విలువైనదిగా కనిపించింది. కానీ ప్రతిసారీ, నచికేతుడు దానిని స్పష్టంగా గుర్తించాడు.

**రెండు రకాల స్వేచ్ఛ :** మనం మనల్ని స్వతంత్ర దేశంగా చెప్పుకుంటాము.

కానీ దీని కింద స్వేచ్ఛ అనేది ఇంకోటి ఉంది. దానిపై మనం చాలా తక్కువ శ్రద్ధ పెడతాము. ఈ స్వేచ్ఛ నిజంగా మననుండి ఎప్పుడూ పోలేదని శ్రీ రమణ మహర్షి చెప్పేవారు. అది పోయిందని మనం అనుకున్నాము, అంతే. అది నుదిటిపై ఉన్న కళ్లజోడును మరిచి గదంతా కళ్ళజోడు కోసం వెతకడం లాంటిది. అది ఎప్పుడూ మన మొహం మీదే ఉంటుంది. చేయవలసిన అసలు పని కొత్తదేదో గెలవడం కాదు. చేయవలసిన అసలు పని ఆ పొరపాటును గుర్తించడం మాత్రమే.

శ్రీ కృష్ణమూర్తి ఇంకా ముందుకు వెళ్లారు. చాలామందికి ఇది అంగీకరించడం కష్టమైంది. ఏదో దాని నుండి స్వేచ్ఛ, ఒక పాలకుడి నుండి, ఒక నియమం నుండి, ఒక భయం నుండి స్వేచ్ఛ మాత్రమే అయితే, అది నిజమైన స్వేచ్ఛ కాదని ఆయన అన్నారు. అది కేవలం ఒక ప్రతిచర్య మాత్రమే. ఆ ప్రతిచర్య తాను వ్యతిరేకించే దానికే కట్టుబడి ఉంటుంది. శ్రీ కంచి పరమాచార్య ఎప్పుడూ ఆచరణాత్మ కంగా ఉండేవారు. ధర్మం లేని స్వేచ్ఛ నిలవదని ఆయన హెచ్చరించారు. ధర్మం లేకపోతే, స్వేచ్ఛ మనకు నచ్చినట్టు చేసుకోవడంగా మారిపోతుంది. అప్పుడు దారి చూపించే వారు ఎవరూ లేకుండా మనల్ని మనమే ఒక పాలకుడిని ఇంకో చెడ్డ పాలకుడితో మార్చుకున్నామని తెలుసుకుంటాము.

**గురువుగారు మరియు నాన్నగారి మాటలు:** గురువుగారు (సద్గురు శ్రీశివానంద మూర్తి భగవానులవారు), నాన్నగారు (శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవులు) దీన్ని అందరికన్నా సులభంగా వివరించారు. ఒక దేశం అంటే దాని భూమి కాదు, దాని ప్రజలే అని వారు చెప్పేవారు. కాబట్టి మనం స్వతంత్రులమని సంబర పడే ముందు, ఈ ప్రజలు దేనికి కట్టుబడి ఉన్నారో అడగాలి. మనకు వచ్చిన స్వేచ్ఛ, మనం కోరుకున్న స్వేచ్ఛేనా అని కూడా అడగాలి. విస్తృత అర్థంలో, పూర్తిగా అది కాదని వారు చెప్పేవారు. మన సొంత భూమిలో మన సొంత ధర్మాన్ని ఆచరించలేకపోవడం వల్ల స్వాతంత్ర్య ఉద్యమం మొదలైంది. ఈ దేశం కర్మభూమి కావాలి, మంచి పనులు చేయడానికి ఉన్న భూమి. కానీ దీనిని తప్పు పనులకు వాడుకున్నారు. చివరికి, మనం సాధించినదానిలో ఎక్కువ భాగం పరిస్థితులు, సమయాన్ని బట్టి నిర్ణయమైంది. మనం నిజంగా కోరుకున్నదాని బట్టి కాదు.

మనకు స్వాతంత్రం రూపంలో ఒక స్వేచ్ఛ వచ్చింది. కానీ అది మనం కోరుకున్న స్వేచ్ఛ కాదు.కానీ రెండో స్వేచ్ఛ ఒకటి ఉందని వారు ఎప్పుడూ చెప్పేవారు. చిన్నది. దీన్ని మనం ఎప్పుడూ కోల్పోలేదు. ధర్మాన్ని, అధర్మాన్ని ఎంచుకునే స్వేచ్ఛ మనకు ఇప్పటికీ ఉంది. కేవలం గమనించే స్వేచ్ఛ మనకు ఇప్పటికీ ఉంది. మన ఆలోచనలను మనం గమనించవచ్చు. మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనించ వచ్చు. దానికి ప్రతిస్పందించే బదులు. ఈ స్వేచ్ఛ మనల్ని ఎప్పుడూ వదిలిపెట్టలేదు. మారింది ఏమిటంటే, మనం దీన్ని ఎంత అరుదుగా వాడుతున్నామో అనేది. మనం ప్రతిస్పందించవచ్చు, లేదా నిశ్శబ్దంగా గమనించవచ్చు. దాదాపు ప్రతిసారీ, మనం ప్రతిస్పందించడాన్నే ఎంచుకుంటాము. దీన్నే మనం బలం అంటాము.గురువుగారు ఒకసారి దీనికి ఒక సంఖ్య రూపంలో చెప్పారు. మనం ఎంత దూరం జారిపోయామో అది చూపించింది. సత్య యుగంలో, నూరు మందిలో తొంభై తొమ్మిది మంది ధర్మాన్ని ఎంచుకున్నారని వారు చెప్పారు. త్రేతాయుగంలో, ఎనభైకి దగ్గరగా... ద్వాపర యుగంలో, యాభైకి దగ్గరగా.... కలియుగంలో, మనం పదిమందికన్నా తక్కువకు పడిపోయాము. కలియుగం చివర్లో, బహుశా ఒక్కరు మాత్రమే ఉంటారేమో! ఇది వినగానే, నేను గత సంచికలో రాసిన ఒక విషయం గుర్తొచ్చింది. గురువుకు మనం నిజంగా తిరిగి ఏం ఇవ్వగలమని నేను వ్యాసంలో అడిగాను. అర్థం చేసుకోవడానికి చేసే ప్రయత్నమే నిజమైన కానుక అని నేను చెప్పాను. ఇది స్వేచ్ఛకు దారితీసే ప్రయత్నం అదే అని ఇప్పుడు తెలుస్తోంది. ఇవి రెండు వేర్వేరు విషయాలు కావు. గురువుగారు, నాన్నగారు దీన్ని చాలాసార్లు, వేర్వేరు మాటల్లో చెప్పారు. స్వేచ్ఛ ఎప్పుడూ భౌతికమైన వస్తువు కాదు. దీన్ని మనకు ఇవ్వలేరు. దీన్ని మన నుండి తీసుకోలేరు. అది అంతకన్నా నిశ్శబ్దమైన చోట ఉంటుంది. అది లేదని మనం గుర్తించడానికి చాలా ముందు నుంచే, అది మనం గుర్తించడం కోసం వేచి ఉంది. ఇది నన్ను మళ్లీ ఆ పాత కథలోని తలుపు దగ్గరకు, మూడు రోజులు దాని బయట కూర్చున్న బాలుడి దగ్గరకు తీసుకువెళుతుంది. యముడు చివరికి ఆ తలుపు తెరిచిన క్షణమే ముఖ్యమైనదని నేను అనుకునేవాడిని. ఇప్పుడు నేను అలా అనుకోను. దాన్ని తెరవడానికి నచికేతుడికి నిజంగా యముడు అవసరం లేదు. అది తాళం వేసి ఉందని నమ్మడం మానేస్తే చాలు.

# The Door That Was Never Locked - The Boy Who Would Not Leave

### *(An Independence Day Reflection)*

*- Gentela Anand Shanker*

Three days..... that is how long a boy once sat outside a door. The door would not open. It was not his house. The god who lived there was not at home. His name was Nachiketa. The trouble began with a sacrifice his father was doing. It was called the Vishvajit Yajna. This sacrifice was meant to win everything,.. in this life and the next. But there was a rule. The person doing it had to give away everything he owned. Nothing could be held back. Nachiketa's father made this promise. But when the time came, he gave away old cows. These cows could not give milk. They could not work in the fields. They had nothing left to give. Nachiketa saw this. He grew worried for his father. He kept asking, "Who will you give me to?  "His father grew angry." Finally, he said, "I give you to Death." Most children would think these were just angry words. But Nachiketa did not. He went to find Yama,.. the Lord of Death. Yama was not home. So Nachiketa waited outside his door. He waited for three days. He had no food. No one spoke to him. He would not go in without being asked. And he would not leave. Yama came home. He learned what had happened. He felt troubled. A guest had gone hungry at his door. This was against dharma. Yama was the host, and he had failed. So he offered the boy three (boons) wishes. Anything the boy wanted. This would make things right.

Nachiketa's first two wishes were simple. He asked for peace with his father. He asked to learn a special ritual, one that would lead him to heaven. Yama said yes to both,.. quickly. These were small things. Then came the third wish. This one was not small. Nachiketa wanted to know what happens to a person after death. Yama tried to change his mind. First he was gentle. Then he was more firm. He offered wealth, enough for ten lifetimes. He offered a kingdom. He offered sons, cattle, gold, and a life of a hundred years. He offered the best dancers and singers in the world. "Ask me for something else", he said. "Even the gods do not fully understand this question. Do not use your (boon) wish on it." Nachiketa said no to everything. He told Yama, "All these things wear out over time. Even a hundred years would end the same way. It would only mean waiting longer at the same door." This answer moved Yama. He stopped testing the boy. He began to teach him instead. "Every person can choose between two paths," he said. "One path is pleasant. The other path is good. Most people choose the pleasant path. It is loud and easy to find. The good path is quiet. It takes effort to find." Then he gave Nachiketa the answer he wanted. There is something in every person, he said. It is never born, and it never dies. It cannot be seen or touched. It sits quietly under everything we call "me."

Whenever I think of this story, I first see courage in it. A boy who could not be bribed. But something smaller stays with me now. Yama offered Nachiketa a way out, again and again. Each time, it looked like something worth having. And each time, Nachiketa saw it clearly for what it was.

**Two Kinds of Freedom:** We call ourselves a free country. We are free, and it cost more than most of us understand. But there is another freedom under this one. We pay much less attention to it. Sri Ramana Maharshi used to say this freedom was never really lost. We only believed it was lost. It is like searching the whole room for your glasses. All the time, they are on your face. The real work is not to win something new. The real work is only to see the mistake. Sri Jiddu Krishnamurti garu went further. Many people found this hard to accept. He said freedom that only means freedom from something, from a ruler, a rule, a fear, is not real freedom. It is only a reaction. And a reaction still stays tied to the thing it fights. Sri Kanchi Paramacharya was always practical. He warned that freedom without dharma does not last. Without dharma, freedom turns into doing whatever we want. Then we find we have only traded one ruler for a worse one. Ourselves, with no one to guide us.

**Guruji and Nannagaru's Words**; Guruji (Sadguru Sri Sivanandamoorthi Bhagavan) and Nannagaru (Sivasri Gentela Venka Ramana Gurudevulu) explained this more simply than anyone. A country, they would say, is its people. Not its land. So before we celebrate being free, we should ask what these people stand for. We should also ask if the freedom we got was the freedom we wanted. In a broad sense, they would say, it was not. Not fully. The freedom movement began because we could not practice our own dharma in our own land. This country was meant to be a karma bhumi, a land for right action. But it was being used for the wrong things. In the end, much of what we won was decided by circumstances and timing. Not by what we truly

wanted. We got a freedom. But it was not quite the freedom we wanted. But there is a second freedom, they would always add. A smaller one. This one we never lost. We still have the freedom to choose dharma over adharma. We still have the freedom to simply watch. We can watch our own thoughts. We can watch the world around us. Instead of reacting to it. This freedom never left us. What has changed is how rarely we use it. We can choose to react, or we can choose to watch quietly. Almost every time, we choose to react. And we call this strength. Guruji once gave a number for this. It showed how far we have drifted. In Satya Yuga, he said, ninety-nine out of a hundred people chose dharma. In Treta Yuga, it was closer to eighty. In Dvapara Yuga, about fifty. In Kali Yuga, we are down to less than ten. Near the end of Kali Yuga, perhaps only one. Hearing this, I think again of something I wrote in the last article. I asked what we can really give a Guru in return. I said the only true gift is the effort to understand. This turns out to be the same effort that leads to freedom. It is not two different things. Guruji and Nannagaru said this many times, in different words. Freedom was never a physical thing. It could not be given to us. It could not be taken from us. It lives somewhere quieter than that. And it has been waiting for us to notice it. Long before we even noticed it was missing. This brings me back to a door in an old story, and a boy who sat outside it for three days. I used to think the important moment was when Yama finally opened that door. I do not think that anymore. Nachiketa never really needed Yama to open it. He only needed to stop believing it was locked.

# దైవభక్తి... దేశభక్తి... సనాతన ధర్మానికి రెండు కళ్లు

**(తెలంగాణా రాష్ట్రం, సూర్యాపేట మాధవ నిలయం ప్రారంభోత్సవం సందర్భంగా శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల కరదీపిక సందేశం - 27.05.26 - మొదటిభాగం)**

**సనాతన ధర్మం :** మనం కేవలం సుఖదు:ఖాలను అనుభవించడాన్ని మాత్రమే మనసుగా అర్థం చేసుకున్నాము. శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ ఇంద్రియములలో నేను మనసును అని చెప్పారు కనుక పరమాత్మనే మనసుగా అర్థం చేసుకోవాలి. మనసు కేవలం సుఖదుఃఖాలను పొందటమే కాక సుఖ దుఃఖాలను అందించే ప్రపంచంగా కూడా తానే ఉన్నది. ఇక్కడ సుఖదు:ఖాలు, ప్రపంచం అనుకున్నప్పుడు ఒక వేరుభావం, విభజన ఉంటుంది. మనసు ఒకే సమయంలో హృదయంలో సూక్ష్మప్రపంచంగానూ, బాహ్యంలో స్థూల ప్రపంచం గానూ ఉన్నది. ఇదే మనసు యొక్క విస్తృత రూపం. అంటే సృష్టి చేయగలుగు తున్నప్పుడు సాక్షాత్ దైవంగానూ, సుఖదుఃఖాలను అనుభవించేప్పుడు జీవుడుగానూ, ఈ ప్రపంచానుభవాలను పొందేటప్పుడు మనిషిగానూ ఉంటుంది. మనసు ప్రపంచంలో పరిస్థితుల ద్వారా సుఖదుఃఖాలను అనుభవించేటప్పుడు తానూ, ప్రపంచం వేరువేరు అనుకుంటుంది. తన సుఖదు:ఖాలకు పరిస్థితులు, ప్రపంచమే కారణమని అపోహ చెందటానికి తన పూర్వ సూక్ష్మస్థితిని ఎరుగక పోవడమే కారణం. దీన్ని మనకు తెలియజేయడానికి పరమాత్మ మహాత్ములుగా, జ్ఞానులుగా అవతరిస్తారు. ఇక్కడ మనసే దైవంగానూ, మనసే దేశంగానూ, మనసే దేహంగానూ ఉంది. తానూ, తన ప్రపంచం వేరు కానప్పటికీ ప్రపంచాన్ని సృష్టించే మనసు సుఖదు:ఖాలను అనుభవించేప్పుడు, జీవనంలోని శీలత, ఏకాత్మభావన లోపించడం వల్ల తాను, ప్రపంచం, పరమాత్మ అనే వేరుభావం కలుగుతుంది. అంటే సుఖ దుఃఖాలకు కారణం ప్రపంచంగానూ, సుఖదుఃఖాలను అనుభవించేది జీవుడిగానూ, వాటిని ఇచ్చేది దైవంగానూ కనిపిస్తుంది. కానీ మన సనాతన ధర్మం నువ్వే దైవం,

నువ్వే ప్రపంచం... మూడు వేరువేరు కావు. నీ జీవన శైలి, వ్యవహారాల వల్ల మాత్రమే ఈ భేదం కలుగుతుంది అని చెప్తుంది. దీనిని ఏ మతము చెప్పదు. దీనినే సనాతన ధర్మము అన్నారు. సనాతన ధర్మము అంటే మనసే స్రష్ట, మనసే సృష్టి అని చెప్పే విశిష్ట జ్ఞానం.

**సృష్టిస్థితిలయాలు :** మన భరతమాత తాను సృష్టి చేసుకున్నప్పుడు తానే భగవంతుడిగా, తానే భగవంతుని అవతారాలుగా, తానే మహనీయులుగా, తానే దేశభక్తులుగా, తానే పౌరులుగా అవతరిస్తుంది. దైవం అంటే దైవీగుణాలు. మనసు అంటే మనుష్య గుణాలు. సృష్టిలో కేవలం మనిషి మాత్రమే సృష్టించబడలేదు. మనిషితో పాటు రాయి నుండి పర్వతాల దాకా, సెలఏరుమొదలు సముద్రం దాకా, గడ్డిపరకలు మొదలు మహావృక్షాలదాకా, కీటకాలు మొదలు పశుపక్ష్యాది జీవరాశి వరకూ సృష్టించబడ్డాయి. అంటే మనిషితోపాటు అనంత ప్రకృతి, విశాల ప్రపంచం కూడా ఉంది. ఇందులో ఈ సృష్టితోపాటు స్థితిలయాలు కూడా ఉన్నాయి. స్థితి అంటే పోషణ... అదే ముఖ్య దైవీగుణం... ఇది అనంత ప్రకృతిలో వ్యాపించి ఉన్న ప్రేమ, సేవ. ఇవి అందరూ గుర్తించదగిన గుణాలు. ప్రేమ, సేవ వేరు కాదు. ప్రేమ సూక్ష్మం, సేవ స్థూలం. అవ్యక్తంగా ఉండే ప్రేమకు వ్యక్తరూపమే సేవ. ప్రేమ క్రియారూపంలో సేవగా నిలుస్తుంది. అదే ఈ సృష్టిలో స్థితిగా నిలిచే పోషణగుణం. ఫలాపేక్షలేక చేసే పనినే సేవ అన్నారు. ఈ గుణం మనసులో వ్యక్తమైతే ప్రేమ. పంచభూతాల్లోని ఆ ప్రేమ ద్వారా అనంత జీవరాశి పొందే ఫలమే స్థితి. సమస్త జీవరాశిలో సహజంగా సజీవంగా వ్యక్తమౌతున్న గుణం అది. కానీ కాలగమనంలో ఒక్క మనుషుల్లోనే ఇది వ్యవహారంగా మిగిలిపోయి సహాయం అని పేరుతో పిలవబడుతుంది. పైన పేర్కొన్న సహజ గుణమే ధర్మం. కానీ కేవలం మనిషి నేడు ఏదో ఒక ప్రయోజనం కోసం పరిమితంగా చేస్తున్నది ధర్మంకాదు. మనిషి మర్చిపోయిన ఈ మౌలిక గుణాన్ని గుర్తు చేయడానికి వచ్చిన వారే మహాత్ములు. వివిధ రీతుల్లో బోధచేయడానికి వచ్చిన మహనీయుల్లో దేశభక్తిరూపంలో బోధించే మహనీయులు కూడా ఉన్నారు. అలాంటి వారిలో వందేళ్లక్రితమే వజ్రసంకల్పంతో ఆర్ఎస్ఎస్‌ని స్థాపించిన డాక్టర్ హెడ్గేవార్‌జీ అగ్రగణ్యులుగా నిలుస్తారు. వారుస్థాపించిన ఆర్ఎస్ఎస్ సృష్టిలోని ఆ మౌలిక

గుణానికి ప్రతీకగా నిలుస్తుంది. కానీ అది పౌరవ్యవస్థలో మనకు కనిపించే పరిమితమైన రక్షణ వ్యవస్థ లాంటిది కాదు రక్షణ వ్యవస్థ మితంగా ఉన్నట్లే విశాలంగా ఉన్న సమాజంలో సేవాదృక్పథం ఉన్నవారు, దానిన బోధించేవారు అత్యంత పరిమితంగా మిగిలిపోయారు. తీగ ఒక్కటే ఉన్నా పందిరి ఎంత విశాలంగా ఉంటే అది అంత బాగా విస్తరించి అంత విస్తృత ఫలాలను ఇస్తుంది. మన సనాతన ధర్మంలోని ఆ మౌలికగుణం అనే తీగకు మనమంతా పందిరి కావాలి. ఆ తీగను పందిరిని కలిపే సద్బోధ అనే తాడు అవసరం. అలాంటి పాత్రను పోషించే ఆర్ఎస్ఎస్ వంటి సేవాసంస్థలను మనమంతా ఆదరించాలి. భావ సారూప్యత, సత్సంబంధం అనే తాడుగా మనందరం మారాలి. అప్పుడు భరతమాతకు మనమంతా పందిరై 150 కోట్ల మంది భారతీయుల హృదయాల్లో సనాతన ధర్మం మళ్లీ పరిఢవిల్లుతుంది. అప్పుడే సృష్టితోపాటు స్థితికూడా కొనసాగుతుంది. సేవలో భగవంతుడు వసిస్తాడు. ఎప్పుడైతే సృష్టిలోని మౌలిక ప్రేమగుణం మనిషిలో లోపిస్తుందో సహజ సేవాభావం కనుమరుగై అది లయం అవుతుంది. అదే ప్రకృతిలో కూడా క్షీణిస్తే అది విలయంగా, ప్రళయంగా పరిణమిస్తుంది. నేడు మనం చూస్తున్న విపరీతాలు, వైపరీత్యాలే దానికి సంకేతాలు. ఆ కాపాడుకోవాల్సిన మౌలిక గుణమే శీలత. సృష్టికి లయం లేదు. మనలోని ప్రేమగుణం లయం కావడమే సమస్త జీవరాశికి అందాల్సిన సృష్టి ఫలాలను లయం చేస్తుంది.

**సనాతన ధర్మ పునరుద్ధరణ :** జ్ఞానులు మనని మనం మార్చుకోవాలని చెప్తారు కానీ ఎవరినో మార్చమని చెప్పరు. మనని మనం ఎలా మార్చుకోవాలో చెప్పటానికే మహాత్ములు అవతరించారు. అందుకు దేశభక్తిరూపంలో సంఘటితం ఎలా కావాలో డాక్టర్ హెడ్గేవార్‌జీ వంటి దేశభక్తులు మార్గనిర్దేశం చేస్తారు. ఆవేశ పూరితంగా కాక హృదయంలో ఆలోచనగా ప్రవేశపెట్టే విధానాలు చెప్తారు. సేవ దైవీగుణం. సేవాసంఘం అంటే ఆ సేవాగుణం కొనసాగే సమూహం. అది ఒక వర్గానికి సంబంధించిన మాటకాదు. అందరిలో ఉన్న ఆ పరమాత్మగుణాన్ని తట్టిలేపేది. వేదంద్వారా మనలోని దివ్యత్వాన్ని చెప్పడానికి మహర్షులు వచ్చినట్లే మనలోని ప్రేమ, సేవ, సౌశీల్యత అనే పరమాత్మ దైవీగుణాన్ని గుర్తుచేయడానికి దేశభక్తులు అవతరిస్తారు. మన దేశంలోని సనాతన ధర్మంలో వ్యక్తి ఆరాధన ఉండదు. ఉన్నత

వ్యక్తిత్వంగా ఉండే పరమాత్మ తత్వాన్ని అరాధించడమే ఉంటుంది. అది మనసులో కొత్తకొత్త ముద్రలను కల్పించదు, ఉన్న ముద్రలను తొలగిస్తుంది. కుటుంబం అంటే కేవలం రక్తసంబంధం కాదు, సృష్టి అంతా ఉండే ప్రేమ విషయంలో భావ సంబంధమే నిజమైన కుటుంబం అని తెలియజేస్తుంది. అది సృష్టిలో ఎన్నో ప్రాణుల్లో వ్యక్తం కావడం మనం సజీవంగా దర్శించవచ్చు.

రైలుపట్టాల ప్రక్కనే ప్రమాదం అంచున నిలబడ్డ పసికందును ఒక గోమాత ఒక్క ఉదుటున వచ్చి రక్షించిన సంఘటన మనమంతా మాధ్యమాల్లో చూశాము. తన జాతి కాకపోయినా, రక్తసంబంధం లేకపోయినా తన ప్రాణాలను కూడా లెక్కచేయని ఆ గోమాతలో భావసంబంధమే కనిపిస్తుంది. త్రాచుపామునుండి తన యజమానిని కాపాడిన పెంపుడుకుక్క, పై అంతస్తునుండి పడిపోయే చిన్నారిని కాపాడిన ఒక పిల్లి, తనకు ఆహారంగా పనికొస్తుందని కూడా చూడకుండా ఒడ్డున పడ్డ చేపను నీటిలోకి చేర్చిన ఒక కొంగ, యజమాని మరణిస్తే అంత్యక్రియల వరకూ అంటిపెట్టుకొని ఉండే కుక్క, ఏనుగు వంటి అనేక జీవరాశుల్లో వ్యక్తమైన ఆ భావసంబంధం నేడు మనుషజాతిలో ఎందుకు కరువైందో మనం ఆలోచించాలి. హైదరాబాద్‌లోని ఒక ఉమ్మడి కుటుంబంలోని మహిళ తన తోటికోడలు కుమారుడికి జ్యూస్ అని చెప్పి యాసిడ్ త్రాగించిన ఘటన అందరి హృదయాలను కలిచి వేసింది. అటువంటి అనేక సంఘటనల్లో మనకు కనుమరుగౌతున్న ఆ భావ సంబంధమే కనిపిస్తుంది. మనిషి ప్రతి సంబంధ బాంధవ్యం విషయంలో ప్రకృతిలోని సహజమౌలిక గుణమైన ప్రేమ, సేవలను మర్చిపోవడం దేనికి సంకేతంగా నిలుస్తుందో తెలియాలి. అది రేపు ప్రకృతిలో ప్రతిఫలించినప్పుడు మనం ఎలా ఎదుర్కోవాలో ఒక్కసారి ప్రతిఒక్కరం ఆత్మపరిశీలన చేసుకోవాలి. యాసిడ్ త్రాగి పేగులు మాడిపోయిన ఆ బాలుడి తీరని దాహం రేపు ప్రకృతిరూపంలో మానవజాతినే కాదు సమస్త ప్రాణికోటిని వెంటాడబోతుందని గుర్తించలేక భావ సంబంధం ఆవశ్యకతను విస్మరిస్తున్నాము. మానవజాతిలో లోపిస్తున్న మౌలిక గుణాన్ని గుర్తుచేయడానికే భగవంతుడు శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి అవతారాలుగా, శ్రీఆదిశంకరాచర్యులు, శ్రీకంచి పరమాచార్యులు, శ్రీరామకృష్ణపరమహంస,

శ్రీరమణభగవాన్, సద్గురుశ్రీశివానందమూర్తి భగవానులు వంటి మహాత్ములుగా, డాక్టర్ హెడ్గేవార్‌జీ, సుభాష్‌చంద్రబోస్ వంటి అకుంఠిత దేశభక్తులుగా, శ్రీ శివాజి మహరాజ్, శ్రీకృష్ణదేవరాయల వంటి మహారాజులుగా, ఆదర్శంగా నిలిచే సంస్కార వంతులైన పౌరులుగా ఎప్పుడూ అవతరిస్తూనే ఉంటారు. వారిద్వారా మనం నేర్చుకోవాల్సింది, మార్చుకోవాల్సింది విస్మరిస్తే మనతోపాటు మన సహప్రాణుల క్షేమాన్ని, భావితరాల భవిష్యత్తును పణంగా పెట్టినట్లే అవుతుంది.

సాక్షాత్ ఈశ్వరాంశగా 2500 సంవత్సరాలక్రితం మనకోసం అవతరించి ఎన్నో సంస్కరణలను ప్రవేశపెట్టిన ఆది శంకరాచర్యులు మొదలు, వందేళ్లక్రితమే అదే సంస్కరణకోసం ఒక గొప్ప వ్యవస్థను రూపొందించిన డాక్టర్ హెడ్గేవార్‌జీ వరకూ మహాత్ముల ఆశయం ఒక్కటే. మనలో లోపించిన ఆ మౌలికగుణాన్ని గుర్తుచేసి, మనతో ఆచరింపచేసి, మనకు క్షేమంకరమైన సార్థక జీవితాన్ని అందించడమే. సత్యంకోసం బాల్యంలోనే సన్యసించి, 32ఏళ్ల వయసులోనే దేహం చాలించిన ఆదిశంకరాచర్యులు మానవాళికి పరమాత్మతో ఉన్న సంబంధాన్ని తెలియజేసే పంచశీల పరివర్తన సూత్రాలనే బోధించారు. దాన్నే నేటి సమాజానికి తిరిగి గుర్తుచేసి ఆచరింపచేయడంకోసం డాక్టర్ హెడ్గేవార్‌జీ మొదలు నేటి శ్రీమోహన్ భగవత్‌జీ వరకూ కృషి చేస్తున్నారు. మనకు దేహంతో, మనసుతో, కుటుంబంతో, సమాజంతో, ప్రకృతితో ఉన్న సంబంధాన్ని సరిగా గుర్తించి సంస్కరించుకుంటే తప్ప మనలోనే పరమాత్మ ఉన్నాడన్న మన సనాతనధర్మంలోని సూక్ష్మాన్ని గ్రహించలేము. మన దేహంతో ఉండే సంబంధం భౌతికమైతే మనసు, కుటుంబం, సమాజం, ప్రకృతితో ఉండే సంబంధం అధిభౌతికం. దేహసంబంధం బాగుంటే మనలోని అవయవాలు, శరీర ఆరోగ్యం బాగుంటుంది. దేహసంబంధం బాగుండటానికి శరీరవ్యాయామం, యోగా ఎలా అవసరమో మిగిలిన క్షేత్రాల్లో కూడా మనం పంచ పరివర్తనలు చేపడ్తేనే ఆరోగ్యకరమైన సమాజం, దేశంగా పరిమళిస్తుంది. ఒక్క అవయవంలో వ్యాధి వచ్చినా దేహం, మనసు, ఆ కుటుంబం, సంబంధిత సమాజం అంతా బాధపడుతుంది. అలానే ఏ సంబంధబాంధవ్యాల్లో వైకల్యం ఏర్పడ్డా అది సనాతన ధర్మానికి గ్లానిచేసినట్లే అవుతుంది.

***(2 వ భాగం తదుపరి సంచికలో)***

# పురచరిత్రకు పద్యనీరాజనం

(జగ్గయ్యపేట ఘనతపై ప్రముఖ కవి శ్రీమాన్ శ్రీరామకవచం వెంకటేశ్వర్లుగారి పద్య సమర్పణ)

**చ**రిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపట్ల సద్గురు శ్రీశివానందమూర్తి భగవానుల వారు చేసిన విశేషకృషి అందరికీ మార్గదర్శకం. అదేమార్గంలో శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవులు జగ్గయ్యపేట చారిత్రక వైభవాన్ని తెలియజేసే కార్యక్రమానికి శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం (బలుసుపాడు) వేదిక చేశారు. తెలంగాణా రాష్ట్రం కోదాడ పట్టణానికి చెందిన ప్రముఖ కవి శ్రీరామకవచం వెంకటేశ్వర్లుగారు తమ బాల్యంలో జగ్గయ్యపేట పట్టణం ద్వారా పొందిన బహుముఖ ప్రయోజనాలను గుర్తు చేసుకుంటూ వివిధ రంగాల ప్రముఖుల, వర్గాల సేవలను పద్యరూపంలో హృద్యంగా రచించారు. వీరి ప్రయత్నాన్ని అభినందిస్తూ, కృషిని ప్రోత్సహిస్తూ శివశ్రీ రమణ గురుదేవులు 2026 జూలై 26, ఆదివారం గురుకుటుంబం అందరూ ఆ పద్యాలను వినే అవకాశం కల్పించారు. జగ్గయ్యపేట దాతృత్వాన్ని, విద్యాదానాన్ని, కళాపోషణను, సాంస్కృతిక వైభవాన్ని, స్వాతంత్ర సమర ప్రస్థానాన్ని, బహుముఖ ఘనతను శ్లాఘిస్తూ రాసిన పద్యాలు అందరి మన్ననలు అందుకున్నాయి. కవిని, పండితులను సత్కరించిన శివశ్రీ రమణ గురుదేవులు ఇదే స్ఫూర్తితో జగ్గయ్యపేట సమగ్ర చరిత్రను కూడా రచించాలని కార్యక్రమంలోని పండితులకు సూచన చేశారు.



*శ్రీగురుధామ్ ధర్మక్షేత్రంలోని సద్గురు సన్నిధిలో (ది. 26.07.26) జగ్గయ్యపేట ఘనతపై శ్రీరామకవచం వెంకటేశ్వర్లు గారి పద్యాలను ఆలకిస్తున్న శివశ్రీ రమణ గురుదేవులు, ఆంధ్ర సంస్కృత భాషాపండితులు శ్రీమంత్రిప్రగడ భరతారావుగారు, శ్రీవడ్డేపల్లి శ్రీనివాసరావుగారు, సిఐ శ్రీ వేంకటేశ్వరరావు గారు.*

# గురుకుటుంబ ఉత్సవం.... గురుపౌర్ణమి పర్వదినం!

**ఆ**షాడ శుద్ధ పౌర్ణమిని (ది.29.07.26) పురస్కరించుకొని నిర్వహించే గురు పౌర్ణమి పర్వదినం శ్రీగురుధామ్ ధర్మక్షేత్రంలో గురుకుటుంబ ఉత్సవంలా ఉత్సాహంగా సాగింది. ఉభయ తెలుగురాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుండి అరుదెంచిన గురుకుటుంబ సభ్యుల్లో ఆధ్యాత్మికానందం వెల్లివిరిసింది. శివశ్రీ గెంటేల వెంకట రమణ, శ్రీమతి వసంతలక్ష్మి గురుదంపతులతోపాటు శ్రీఆనందశంకర్, శ్రీమతి హర్షిత దంపతులు కలిసి నిర్వహించిన వైదిక కార్యక్రమాలు భక్తులకు కన్నుల పండుగ చేశాయి. సద్గురు శ్రీశివానందమూర్తి భగవానుల వారికి రుద్రాభిషేకంతో కార్యక్రమం మొదలై స్వామికి విశేషార్చన, పుష్పాభిషేకం, పాదుకాపూజ, నక్షత్ర హారతిలతో పరవశింపచేసింది. అత్యంత కమనీయంగా సాగిన శివశ్రీ రమణ గురుదేవుల సత్సంగ ప్రవచనం అందరి హృదయాల్లో ఉత్సవానికి ఒక పూర్ణాహుతిగా నిలిచింది. గురుదంపతులు స్వయంగా వారి అమృతహస్తాలతో అందించిన పర్వదిన గురుప్రసాదం ప్రతిఒక్కరిలో వివేష భక్తిపారవశ్యాన్ని నింపింది.



*1. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని (ది.29.07.26) శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో సద్గురు శ్రీశివానందమూర్తి భగవానులకు పుష్పాభిషేకం సద్గురు దేవుల పాదుకాపూజలో పాల్గొన్న శివశ్రీ రమణ గురుదంపతులు.*

## గ్రామదేవతలకు సామూహిక జలబిందెల సమర్పణ

**భా**రతీయ గ్రామీణ సంప్రదాయంలో ప్రధానాంశంగా నిలిచే గ్రామదేవతల సామూహిక ఆరాధనను జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పలు గ్రామాలవారు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఎలినినో దుష్ప్రభావం కారణంగా ప్రస్తుతం నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులకు పరిష్కారంగా శివశ్రీ గెంటేల వెంకట రమణ గురు దేవులు సామాజిక మాధ్యమం ద్వారా గుర్తుచేసిన ఈ గ్రామీణ సంప్రదాయాన్ని ఈ ప్రాంత ప్రజలు ఆత్మీయ సూచనగా స్వీకరించి ఆచరణాత్మకం చేశారు. పలు గ్రామాల్లో సామూహికంగా ప్రజలంతా కలిసి జలబిందెలతో బారులు తీరి గ్రామదేవతలకు అభిషేకాలు, సారె సమర్పణ, విశేష పూజలు చేశారు. ఎలినినో ప్రభావంలోనూ ఆయా గ్రామాల్లో వర్షాలు కురవడంతో ప్రజలు తమ పూజలకు గ్రామదేవతలు సంతసించి అనుగ్రహించారని కృతజ్ఞతలు తెల్పుకున్నారు. గ్రామదేవతలకు సామూహికంగా నిర్వహించే పూజలవల్ల కలిగే సమిష్టి ప్రయోజ నాలను, సమకూరే రక్షణను, తీరే కోర్కెలను శివశ్రీరమణ గురుదేవులు అత్యంత సహజంగా, సరళంగా వివరించిన తీరుకు ప్రభావితులైన గ్రామీణులు సామూహిక ఉత్సవంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.



*జగ్గయ్యపేట ప్రాంత గ్రామాల్లో ప్రజలు గ్రామదేవతలకు నిర్వహించిన సామూహిక జలాభిషేకం కార్యక్రమం.*

*జలబిందెలతో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు*

# సేవా కార్యక్రమాలతో
# శివశ్రీరమణ గురుదేవుల జన్మదినోత్సవం

శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల 63వ జన్మదినోత్సవం ది. 17.07.26, శుక్రవారం అత్యంత నిరాడంబరంగా జరిగింది. శ్రీగురుధామ్‌లో సద్గురుదేవులకు హారతి సమర్పించి అదే హారతిని తమకు ఆశీస్సులుగా స్వీకరించిన శ్రీరమణ గురు దంపతులు భక్తులకు ప్రసాద పంపిణి చేశారు. శివశ్రీ రమణ గురుదేవులు చేసిన జన్మదినోత్సవ ప్రవచనం ప్రతివారికీ అవసరమైన జీవన పరమార్థాన్ని బోధించింది. జగ్గయ్యపేట, హైదరాబాదు, కరీంనగరు, ముస్తాబాదు తదితర ప్రాంతాల్లో గురుకుటుంబ సభ్యులు విశేష సేవా కార్యక్రమాలతో శ్రీరమణ గురుదేవుల జన్మదినోత్సవం నిర్వహించారు.



శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో నిరాడంబరంగా శివశ్రీ రమణ గురుదేవుల జన్మదినోత్సవం





శివశ్రీ రమణ గురుదేవుల జన్మదినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు.

# శివశ్రీ రమణ గురుదేవుల జన్మదిన సందేశం



**మ**నిషి జీవితంలో జన్మదినం అంటే కేవలం సంవత్సరాలు గడవడం లేదా ఆర్భాటంగా వేడుకలు చేసుకోవడం కాదని శివశ్రీ సద్గురు రమణ గురుదేవులు సెలవిచ్చారు. తమకు 63 సంవత్సరాలు పూర్తయి 64వ సంవత్సరం ప్రవేశించిన సందర్భంగా వారు మాట్లాడుతూ "ఈ 63 ఏళ్లలో నేను సాధించింది శూన్యం, మిగిలింది లేదు, తగిలింది లేదు, ఉన్నది ఏదో ఉంది అంతే" అని తమ నిజతత్వాన్ని తెలియజేశారు. చిన్నతనం నుండి పుట్టిన రోజు అంటే.. దేవునికి దండం పెట్టుకోవడం, హారతి తీసుకోవడం తప్ప ఆర్భాటాలు చేసుకోవడం తమకు అలవాటు లేదని చెప్పారు. అసలైన జన్మదినాలు జీవితంలో మూడే మూడు ఉంటాయి: మొదటిది పరమాత్మ యందు హృదయపూర్వక భక్తి కలిగిన రోజు, రెండవది సద్గురువు ప్రథమ దర్శనం లభించిన రోజు (వారికి మార్చి 1988లో సద్గురు శ్రీ శివానంద భగవానుల దర్శనం లభించింది), ఇక మూడవది గురువు అనుగ్రహంతో బాధలను దాటి లోపల ఉన్న అనంతమైన ఆనందాన్ని గ్రహించిన రోజు. ఆ రోజున గురువు సంతోషపడి "సెబాష్" అని మెచ్చుకుంటారు.

మానవ జీవితంలో కోరికలు, ఆలోచనలు, సంసార తాపత్రయాలు, శరీర

బాధలు, సుఖదుఃఖాలు ఉండటం సహజం. గురువు గారి అనుగ్రహం వల్ల ఇన్ని కోరికలు, ఆలోచనలు, శారీరక మానసిక బాధలు ఉన్నప్పటికీ, హృదయంలోని ఆనందాన్ని ఇవేవీ తాకలేవు. మనసులో పొద్దున లేచినప్పటి నుండి రాత్రి వరకు వేలాది ఆలోచనలు వస్తుంటాయి; వాటిని ఆపే ప్రయత్నం ఎప్పుడూ చేయకూడదు. ఎప్పుడైతే ఈ ఆలోచనలు, సుఖదుఃఖాలు, శరీర బాధలు, ఈషణత్రయాలు మన అనంతమైన ఆనందాన్ని చెదరగొట్టవో, దాన్నే జ్ఞానము, ధ్యానము, యోగము లేదా సిద్ధి అని పిలుస్తారు. శ్రీ శివానంద భగవానులను కలిసిన తర్వాత అర్థమైన పరమ సత్యం ఏమిటంటే - మనసును బలవంతంగా నిలబెట్టాల్సిన అవసరం లేదు, ఆలోచనలను ఆపాలనే ప్రయత్నమూ అవసరం లేదు. ఆలోచనలలో రకాలు ఉన్నాయి: మన గురించి మనకుండే ఆలోచనల్లో మొదటిది భార్యాపిల్లలు (కుటుంబము), రెండవది సమాజం గురించి ఆలోచన, మూడవది దేవుడు-భక్తి-జ్ఞానము అనే ఆలోచన. ఇవన్నీ ఆలోచనలే అయినా, మనల్ని తీవ్రంగా ఇబ్బంది పెట్టే ఏకైక ఆలోచన "బాధ" అనే ఆలోచన మాత్రమే. ఉద్యోగం, పిల్లల పెళ్లిళ్లు, ఆరోగ్యం, ఆర్థిక విషయాల లాగానే బాధ కూడా ఒక ఆలోచనే! ఏదైనా ఒక విషయం మనకు తెలియుటయే ఆలోచన. మనసులో ప్రశాంతతకు బదులు ఆందోళన ఉన్నప్పుడు అది తెలిస్తే, కాలిలో ముల్లు గుచ్చుకున్నప్పుడు తీసేయడానికి ప్రయత్నించినట్లే, ఆ బాధను తీసేయాలని చూస్తాం. అందుకే బాధ అనేది ఆలోచనలలో అత్యంత ప్రమాదకరమైనది. ఈ 'బాధ' అనే ఒక్క ఆలోచన రాకుండా చేసుకోగలిగితే, మిగిలిన ఎన్ని ఆలోచనలు ఉన్నా పర్వాలేదు. బాధ అనే ఆలోచన లేకపోతేనే జ్ఞానము, ప్రశాంతత, మరియు సుఖము ఉన్నట్లు. లోకంలో "వాడు సుఖపడుతున్నాడు" అని ఎప్పుడు అంటారంటే, వాడిలో చీకు చింత, బాధ కనపడనప్పుడే!

ఆలోచనలను పూర్తిగా ఆపడం ఎవరికీ సాధ్యం కాదు; ఎందుకంటే ఆలోచించడం, మేల్కొని ఉండడం, ఆలోచన ఆపి నిద్రపోవడం మనసు యొక్క సహజ లక్షణం. అందుకే ఆలోచనలు పోవాలని ఆరాటపడకుండా, బాధ అనే ఆలోచన మనసును తాకకుండా చూసుకోవాలి. బాధ లేకపోతే మనిషి ప్రశాంతంగా సంసారం, పూజలు, ధ్యానం, యాత్రలు, స్నేహం చేయగలడు. మన స్వరూపమైన ఆనందం ఎప్పుడూ హృదయంలోనే ఉంటుంది. దాన్ని గమనిస్తే బాధలు తొలగిపోతాయి.

లేనిది ఉన్నట్లు భావిస్తే బాధ ఉంటుంది; కానీ లోపల నిరంతరం ఉండే ప్రశాంతతను, ఆనందాన్ని అవగాహన చేసుకుంటే బాధ మాయమవుతుంది. ఏదైనా జ్ఞాపకం వచ్చినప్పుడే ఆందోళన, బాధ కలుగుతాయి; ఆ జ్ఞాపకం లేనప్పుడు ఉండేది ప్రశాంతతే. ఇక్కడ ఒక ముఖ్యమైన సత్యాన్ని గుర్తించాలి: ఆందోళన, బాధలు వచ్చిపోయేవి; కానీ హృదయపూర్వక ప్రశాంతత, ఆనందం ఎప్పుడూ స్థిరంగా ఉండేవి. ఆందోళన పడే మనసు ఆనందాన్ని చూడటం మొదలుపెడితే అది నిలకడగా మారుతుంది. దీనికి అనేక నిత్య జీవిత ఉదాహరణలు ఉన్నాయి. మనసులోని బాధ ఒక చిన్న అగ్గిపుల్ల లేదా మిణుగురు పురుగు వెలుగు లాంటిది; దాని శక్తి చాలా తక్కువ. కానీ హృదయములోని ఆనందం సూర్యప్రకాశం లాంటిది, అపారమైన శివానందం లాంటిది. పెద్ద పెను తుఫాను (టైఫూన్ లేదా టోర్నడో) వచ్చినప్పుడు పెద్ద ఇళ్లు, కార్లు, ట్రక్కులు ఎలా కొట్టుకుపోతాయో, అనంతమైన ఆనందం ముందు బాధ అనే చిన్న దీపం నిలబడలేదు. అలాగే జ్వరం వచ్చినప్పుడు నోరు అరుచిగా ఉండి, ఏ తీపి తిన్నా చేదుగానే అనిపిస్తుంది. లోపలి అజ్ఞానం వల్లనే బయట కుటుంబ సమస్యలు, ఈతిబాధలు అన్నీ పెద్దవిగా కనపడతాయి; లోపల అవగాహన, వెలుగు పెరిగితే బయట అంతా సవ్యంగానే అనిపిస్తుంది. ఒక జ్ఞానికి ప్రపంచమంతా బాగానే కనిపిస్తుంది.

ప్రశాంతత అనేది 1000 క్యాండిల్ పవర్ వెలుగు లాంటిది. బయట వర్షం పడినా, ఎదురుగాలి వచ్చినా నీళ్లు ఇంట్లోకి రాకుండా చూసుకుంటే ఇంట్లోని వస్తువులు సురక్షితంగా ఉంటాయి. నీళ్ల మీద పడవ ఉంటే ప్రమాదం లేదు కానీ, పడవ లోపలికి నీళ్లు రాకూడదు. అలాగే ప్రపంచంలో మనం ఉన్నా, మనసులో ప్రపంచం ఉండకూడదు. మనలోని ఆనందంలోనికి బాధ అనే నీటిని రానివ్వకూడదు. గురువు దర్శనం పొందిన మొదటి రోజే నిజమైన జన్మదినం. ఆ తర్వాత కష్టాలు, బాధలు, దుఃఖాలు ఏవీ మన ఆనందాన్ని తాకడం లేదని తెలిస్తే వారికి జన్మరాహిత్యం, జీవనముక్తి లభించినట్లే. అక్కడ శాంతి ఉంది, ఎక్కడ శాంతి ఉందో అక్కడ జ్ఞానము, ఆనందము, ధ్యానము ఉంటాయి. మనసును బాధ తాకని స్థితినే పెద్దలు 'ధ్యానము' అని పిలిచారు.

పెద్దల వద్దకు వెళ్లి శుభాకాంక్షలు చెప్పడం అంటే ఏదో లౌకిక కోరికలు కోరడం కాదు. సాధారణంగా మనం చెప్పే ఆకాంక్షలలో స్వార్థం ఉండటం, స్పష్టత లేకపోవడం, 'నేను-నువ్వు' అనే భేదం ఉండటం గమనించవచ్చు. కానీ గురువులు, జ్ఞానులు కోరే ఆకాంక్షలో పవిత్రత ఉంటుంది. అందుకే పెద్దల దగ్గరకు వెళ్లినప్పుడు "నాకు కూడా సత్యం తెలియాలి, శుభాన్ని ఇచ్చే ఆనందాన్ని చూసే పవిత్రత నాకు కలిగేట్టు చేయండి" అని అడగడమే నిజమైన శుభాకాంక్ష. శివానంద భగవానుల వారు దాన్నే 'లోకక్షేమం' అన్నారు. జ్ఞాని సంకల్పం బ్రహ్మ సంకల్పం అవుతుంది. జీవితంలో అనేక అనుభవాలు ఉంటాయి. ధనం ఉన్న రోజులు, లేని రోజులు, తిండి ఉన్న రోజులు, ఉపవాసాలు, ఆరోగ్యం, అనారోగ్యం, నిద్ర పట్టిన రాత్రులు, పట్టని రాత్రులు, అలాగే తల్లిదండ్రులు, బామ్మలు, ఇతర ఆత్మీయులు చనిపోయిన సందర్భాలు ఇవన్నీ ఎదురవుతాయి. చనిపోయిన వారి గురించి ఏడుస్తూ కూర్చుంటే ఉన్న ఆత్మీయులను మర్చిపోతాం. అలాగే వచ్చిపోయే బాధలనే చూస్తూ కూర్చుంటే, నిరంతరం మనతోనే ఉన్న అనంతమైన ఆనందాన్ని మర్చిపోతాం. విచారణ అంటే బాధ ఉండగానే దాని పక్కనే ఉన్న ఆనందాన్ని కూడా చూడటం! రాత్రి ఉంటే పగలు ఉన్నట్లే, బాధ ఉన్న చోటే ఆనందమూ ఉంటుంది. జిడ్డు కృష్ణమూర్తి గారు చెప్పినట్లు ఉన్న దాంట్లోనే నిజం, అబద్ధం రెండూ ఉన్నాయి; నిజాన్ని జాగ్రత్తగా చూస్తే అబద్ధం అదృశ్యమవుతుంది. మన లోపల ఉన్న నిధి (ఆనందం) వైపు చూస్తే, ఎలాంటి పెద్ద జబ్బులైనా, క్యాన్సర్ ముత్తాత వచ్చినా సరే అది తొలగిపోవాల్సిందే; ఎందుకంటే అక్కడ దరిద్రం లేదు, కేవలం ఐశ్వర్యమే ఉంది. దీనికి పెద్దగా శ్రమపడాల్సిన సాధనలు, ధ్యానాలు, కష్టాలు అవసరం లేదు. ఆలోచనలను ఆపాల్సిన పనిలేదు. ఎలాగైతే ఆకలి, నిద్ర, దాహం అనేవి ఆలోచిస్తే వచ్చేవి కాక సహజంగా ఉంటాయో, ఆనందం కూడా మన హృదయంలో సహజంగానే ఉంది. "ఆలోచన ఆపడం" అంటే నీకు ఏది సహజమో దాని గురించి అనవసరంగా ఆలోచించకపోవడమే! లోపల నిరంతరం వెలిగే ఆనందాన్ని గమనిస్తూ, బాధ అనే తలంపు మనసును తాకకుండా ఉంచుకోవడమే సద్గురువు అందించే జ్ఞాన వైభవం మరియు జీవిత పరమార్థం.

# నిద్రకీ.... జ్ఞానానికీ.... తేడాఏమిటి

## (శివశ్రీ రమణ గురుదేవుల ప్రభోధం)

సామాన్యుడికి, జ్ఞానికి నిద్రానుభవంలో ఉన్న తేడా ఏమిటి? ప్రతిరోజూ నిద్రలో ఆత్మజ్ఞాన అనుభవం అవుతున్నప్పుడు జ్ఞానికి ఉన్న ప్రత్యేకత ఏమిటి? నిద్రలో జ్ఞానికి, సాధకుడికి తేడా ఏమీ లేదు. నిద్రలో ప్రతి ఒక్కరూ మనస్సు లేదా "నేను" అనే భావం లేకుండానే ఆనందాన్ని, ప్రశాంతతను పొందుతున్నారు. అయితే మెలకువ వచ్చిన తర్వాత సాధకుడు తన మనస్సును, అహంకారాన్ని పట్టుకుని ఆత్మజ్ఞానం రాలేదని వేదన చెందుతుండగా, జ్ఞాని మాత్రం మెలకువ స్థితిలో కూడా మనస్సుతో సంబంధం లేకుండా అదే జ్ఞానంతో, శాంతితో ఉంటున్నాడు. నిద్రలో మనస్సు, బుద్ధి, శరీరం, "నేను" అనే భావన ఏదీ ఉండదు. అయినా అక్కడ పరమ ఆనందం మరియు శాంతి లభిస్తున్నాయి. మెలకువ వచ్చాక "నేను హాయిగా నిద్రపోయాను" అని చెబుతున్నాం కానీ, ఆ నిద్ర సమయంలో ఆ "నేను" లేదు. దీనిని బట్టి ఏదైనా ఒక అనుభవానికి లేదా ఆనందానికి మనస్సు లేదా అహంకారం అసలు అవసరమే లేదని స్పష్టమవుతుంది. జ్ఞాని ఈ విషయాలను స్పష్టంగా గ్రహించి మనస్సును ఒక పనిముట్టుగా మాత్రమే అవసరమైనప్పుడు వాడుకుంటాడు, సామాన్యుడు మాత్రం మనస్సు లేకపోతే ప్రపంచ అనుభవం లేదా ఆనందం రాదనే అపార్థంతో దానిని విపరీతంగా పట్టుకుని వేలాడుతాడు. శరీరంలో ఆకలి కావడం, తిన్న అన్నం జీర్ణమై కడుపు నిండడం లాంటి అనుభూతులను మనం కళ్లతో చూసి చెప్పం; అవి మన ప్రయత్నం లేకుండానే ఎరుకలోకి వస్తాయి. అలాగే పరమాత్మ అనుభూతికి లేదా పూర్ణ ప్రశాంతతకు ఈ బాహ్య మనస్సుతో పని లేదు. పరమాత్మ పూర్ణుడు, ఆయన స్వరూపమైన ప్రపంచం కూడా పూర్ణమైనదే. నిద్రలో మనస్సు లేనప్పుడు మనం ఆ పరమాత్మ యొక్క పూర్ణ శాంతిని పొందుతున్నాం. కానీ మెలకువలో మనస్సును అడ్డుపెట్టుకుని ప్రపంచాన్ని అనుభవించడానికి ప్రయత్నించినప్పుడు కేవలం పాక్షిక అనుభవాన్ని మాత్రమే పొందగలుగుతున్నాం. మనస్సు, అహంకారం అనేవి ప్రత్యేకంగా ఉన్న వస్తువులు కావు, అవి కేవలం ఒక అపార్థం మాత్రమే. మనస్సు అవసరం లేదనే

## మధుర స్మృతులు



*2010 లో అమెరికా వెళుతున్న సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానులకు విమానాశ్రయంలో వీడ్కోలు పలుకుతున్న శివశ్రీ వెంకటరమణ గురుదేవులు*

సత్యం అవగాహనకు వస్తే అది దానంతట అదే సమసిపోతుంది. అజ్ఞానము అంటే... అశాంతి, వేదన, ప్రశ్నలతో కూడిన అనుభవంలో ఉండటం. మనస్సులోని కర్తృత్వ భావం, బాధ్యతల భారం మోయడమే ఈ అశాంతికి కారణం. జ్ఞానము అంటే మనస్సులోని ప్రశ్నలు, వేదనలు తొలగిపోయిన తర్వాత అందరిలోనూ సహజంగా మిగిలే ప్రశాంతతను అనుభవించడమే. రాత్రి పడుకునేముందు అన్ని ఆలోచనలను, కోరికలను పక్కనబెట్టి నిద్రపోవడం వల్ల అక్కడ ఆనందం లభిస్తుంది. ఉదయం లేవగానే మళ్లీ కోరిక, వెతుకులాట మొదలవుతాయి. ఈ వెతుకులాటే, పొందాలనే ఆకాంక్షే "నేను" లేదా "మనస్సు". వెతుకుతున్నంత కాలం 'నేను' ఉంటుంది, ప్రశాంతత దూరమవుతుంది. ఆ వెతకడం లేదా కోరిక ఆగిపోయినప్పుడు ప్రశాంతత దానంతట అదే అనుభవంలోకి వస్తుంది. నిద్రలో పొందే అదే ఆనందాన్ని మెలకువలో పొందాలంటే, ప్రయత్నించేవాడు మరియు వాంఛించేవాడు అనే కోరికను వదిలిపెట్టడమే మార్గం.

# 'జ్ఞాపకం'.... 'కోరిక'లే పెద్ద విఘ్నం



**(శ్రీ ఆదిశంకరాచార్యుల వారి "ఆత్మబోధ"పై శివశ్రీ రమణ గురుదేవుల విశ్లేషణ)**

**'జ్ఞా**పకం' (స్మృతి) మరియు 'కోరిక', బుద్ధి వృత్తితో జీవుడు తన్ను తాను వేరుగా భావించే విధానాలే సాధకుడికి ఆధ్యాత్మిక ప్రయాణంలో ఎదురయ్యే అతి పెద్ద విఘ్నం, సూర్యునికి సూర్య ప్రకాశం ఏ విధంగా సహజమో, ఆత్మకు కూడా సద్రూపత్వం, చిద్రూపత్వం, నిత్యత్వం, ఆనందం మరియు నిర్మలత్వం అంత సహజమైన లక్షణాలు. అయితే జీవుడు తన బుద్ధి వృత్తితో ఈ ఆత్మ చైతన్యాన్ని ముడిపెట్టుకుని, "నేను తెలుసుకుంటున్నాను", "నేను చూస్తున్నాను", "నేను చేస్తున్నాను" అని ప్రవర్తించడం వల్ల అసలైన ఆత్మానుభవాన్ని పొందలేకపోతున్నాడు. ఇక్కడ "నేను" అనే భావమే ఒక పెద్ద అపార్థం. ఆ అపార్థం లేదా అజ్ఞానం తొలగిపోతే మిగిలేది పరమార్థమైన పరమాత్మ స్వరూపమే. మానవునికి అనుభవంలోకి వచ్చే మూడు ముఖ్యమైన అవస్థలు జాగ్రత్, స్వప్న, సుషుప్త్యవస్థలు. సామాన్యంగా సాధకులు ధ్యాన, సమాధి, తురీయావస్థల గురించి పరితపిస్తూ ఉంటారు. కానీ జ్ఞానుల ఉపదేశం ప్రకారం ముందుగా ప్రస్తుతం మనం ఉన్న ఈ అవస్థల స్వభావాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడం అవసరం. ప్రతి అనుభవంలోనూ, ప్రతి క్షణంలోనూ ఉన్నది పూర్ణమైన ఆత్మానుభవమే. సాధకుడు దేనినైతే జ్ఞానమని, విచారణ అని, ధ్యానమని, సమాధి అనుభవమని వెతుకుతున్నాడో, అది ఇప్పటికే అందరిలోనూ పూర్ణంగా, స్వయంప్రకాశకంగా ఉంది. మరి ఆ పూర్ణత్వాన్ని మనం ఎందుకు అనుభవించలేకపోతున్నాము అంటే, దానికి ప్రధాన కారణం మనలోని "జ్ఞాపకమే". జ్ఞాపకం అనేది రెండు రకాలుగా పనిచేస్తుంది. ఒకటేమో గతాన్ని గుర్తు చేయడం, రెండోది వర్తమానంలో లేదా భవిష్యత్తులో చేయవలసిన పనిని స్ఫురణకు తీసుకురావడం. వ్యవహారిక జీవితానికి జ్ఞాపకం అవసరమే అయినప్ప టికీ, ఆధ్యాత్మిక అనుభూతి విషయంలో ఈ జ్ఞాపకమే పెద్ద అడ్డంకిగా మారుతోంది.

సాధకుడు దైవ దర్శనం కోసం లేదా ధ్యాన అనుభూతి కోసం జపం లేదా ధ్యానం చేస్తాడు. ఉదాహరణకు, శివ పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తూ రూపాన్ని లేదా లింగాన్ని దర్శించాలనుకుంటాడు. జపంలో లేదా ధ్యానంలో ఆ రూపం క్షణకాలం కనపడగానే, తక్షణమే మనసులో జ్ఞాపకం ప్రవేశిస్తుంది. "నేను ధ్యానం చేస్తున్నాను, నేను ఈ రూపాన్ని ఊహించుకున్నాను, ఇది నా ఆలోచన మాత్రమే" అని ఆ జ్ఞాపకం వెంట వెంటనే సంకేతాన్ని ఇస్తుంది. ఎప్పుడైతే జ్ఞాపకం ప్రవేశించి, తన ప్రమేయాన్ని చూపిస్తుందో, అప్పుడు ఆ దర్శించిన వస్తువుకి లేదా అనుభవానికి విలువ లేకుండా పోతుంది. నిజానికి ఆ క్షణంలో పొందిన అనుభవం పూర్ణమైనదే, సత్యమైనదే. కానీ జ్ఞాపకం వచ్చి "ఇది నీ ఊహ మాత్రమే, ఇది నిజమైన దర్శనం కాదు" అని మనసును రెచ్చగొడుతుంది. స్వప్నంలో అమ్మవారో, ఆంజనేయ స్వామియో, గురువుగారో వచ్చి మాట్లాడితే, మెలకువ వచ్చాక "అది కలలో జరిగింది, నిజం కాదు, నాకు జాగ్రదవస్థలో అలా ఎదురుగా కనిపిస్తే బాగుండు" అనిపిస్తుంది. ఒకవేళ జాగ్రదవస్థలో ఏదైనా రూపాన్ని చూస్తే, "ఇది నా ఆలోచనా రూపం మాత్రమే, స్వప్నంలో లాగా అద్భుతంగా కనపడితే బాగుండు" అని మనసు భావిస్తుంది.

ఇలా ఒక అవస్థలో ఉన్న అనుభవాన్ని మరొక అవస్థతో పోల్చి, లభించిన అనుభవాన్ని తక్కువ చేసి చూపించే నాటకం ఆడుతున్నది మనలోని జ్ఞాపకమే. స్వప్నము, జాగృతం అనే భేదాలను తెచ్చి, ఒకదానిని అబద్ధమని, ఇంకొకదానిని నిజమని నిర్ణయిస్తూ అనుభవంలోని తృప్తిని చెడగొడుతోంది. నిద్రావస్థ లేదా సుషుప్తవస్థలో ఏ నామరూపాలు ఉండవు. అక్కడ పొందిన ఆనందం ఉదయాన్నే మెలకువ వచ్చాక 'నేను సుఖంగా నిద్రపోయాను' అనే స్మృతి రూపంలో తెలుస్తుంది. కానీ ఆ అనుభవంలో జ్ఞాపకం లేకపోవడం వల్లనే అక్కడ ఆనందం అనుభవంలోకి వచ్చింది. ఒక సినిమా చూస్తున్నప్పుడు, మనం ఆ సినిమాలో మమేకమైపోయినంత వరకు ఆనందాన్ని పొందుతాము. కానీ ఒక్కసారి 'నేను సినిమా చూస్తున్నాను' అనే జ్ఞాపకం రాగానే, ఆ అనుభూతి నుంచి విడిపోతాము. అలాగే ప్రతి అనుభవంలోనూ పొందుతున్న ప్రశాంతత, ఆనందం పూర్ణమైనవే. అది దేహంతో కావచ్చు, మనస్సుతో కావచ్చు, ఆత్మతో కావచ్చు; అనుభవంగా అనుభవం ఎప్పుడూ పూర్ణమే.కానీ జ్ఞాపకం ప్రవేశించి, ఆ అనుభవాన్ని అసత్యమని లేదా అసంపూర్ణమని ముద్ర వేస్తుంది.

కోరిక మరియు జ్ఞాపకం ఒకదానితో ఒకటి ముడిపడి పనిచేస్తాయి. మన మనసులో ఒక అనుభవం ఇలాగే జరగాలి, దైవ దర్శనం ఈ రీతిలోనే ఉండాలి అని ముందుగానే ఒక డిజైన్ లేదా ప్రణాళిక సిద్ధంగా ఉంటుంది. దీనిని "డిజైన్డ్ మెమరీ" అనవచ్చు. మనం అనుకున్న డిజైన్ ప్రకారం అనుభవం రాకపోతే, మనసు దానిని తిరస్కరిస్తుంది. ఎంతటి దివ్యానుభవం ఎదురైనా, ఈ పూర్వ కోరికతో కూడిన జ్ఞాపకం "ఇది కాదు, ఇంకేదో కావాలి" అని రెచ్చగొడుతుంది. శ్రీ రమణ మహర్షులను ఒక సాధకుడు "నాకు ఆత్మదర్శనం ఎలా అవుతుంది?" అని అడిగినప్పుడు, "నువ్వు నిద్రలో ఏం చూస్తున్నావు?" అని తిరిగి ప్రశ్నించారు. నిద్రలో జ్ఞాపకం లేదు కాబట్టి ఏదీ చూడటం లేదు. మెలకువలో "నేను ఏదో చూడాలి" అనే జ్ఞాపకం ఉండటం వల్ల, ఏది చూసినా "ఇది కాదు" అని తిరస్కరిస్తోంది. ఈ "ఇది కాదు" అనే స్వభావం లేదా జ్ఞాపకం లేకపోతే, ప్రస్తుతం ఉన్నదేదో అది పూర్ణ అనుభవంగా భాసిస్తుంది.

దీనికి లౌకికంగా ఒక ఉదాహరణ చెప్పుకోవచ్చు. మనం గోంగూర పచ్చడి తింటున్నప్పుడు, వర్తమానంలో ఆ రుచిని అనుభవించాలి. కానీ తినగానే మన జ్ఞాపకంలో ఉన్న గుంటూరు గోంగూర పచ్చడో లేదా అమలాపురం గోంగూరపచ్చడో గుర్తుకొస్తుంది. ఆ పాత జ్ఞాపకం వచ్చి, ఇప్పుడు తింటున్న పచ్చడి రుచిని సరిపోల్చి, ప్రశాంతతను చెడగొడుతుంది. అలాగే మనం ఎక్కడికైనా వెళ్ళినప్పుడు ప్రశంసను కోరుకుంటాము. అనుకున్నట్లుగా ప్రశంస రాకపోతే ఆందోళన చెందుతాము. ఇక్కడ ప్రశంస రావాలనే కోరిక, దానికి సంబంధించిన జ్ఞాపకమే వర్తమానంలో ఉండవలసిన జ్ఞానాన్ని, ధ్యానాన్ని, ప్రశాంతతను దూరం చేస్తున్నాయి. ఆత్మబోధలో శంకర భగవత్పాదులు చెప్పినట్లు, బుద్ధి తన వృత్తితో కలిసి "నేను తెలుసుకుంటు న్నాను" అని ప్రవర్తించడమే జీవభావం. ఎప్పుడైతే ఈ జ్ఞాపకం ప్రవేశించి "నేను చూస్తున్నాను" అని అంటుందో, వెంటనే జగత్తు, జీవుడు, ఈశ్వరుడు అనే మూడు విభజనలు ఏర్పడతాయి. వాస్తవానికి ఈ అనంత చైతన్య ప్రవాహంలో, ఈ పరమాత్మ సృష్టిలో జగత్తు-జీవుడు-ఈశ్వరుడు అనే భేదాలు లేవు. అంతా ఒకే చైతన్యం.

జ్ఞాపకం అనేది ఖాళీగా ఉన్నప్పుడు వస్తుంది, ఆలోచన అనేది పనిలో ఉన్నప్పుడు వస్తుంది. ఒక ప్రక్రియ లేదా అనుభవం పూర్తవ్వగానే, జ్ఞాపకం వెంటనే ప్రవేశించి తన ఆధిపత్యాన్ని చెలాయిస్తుంది. మనసులోని ఈ కోరికలతో కూడిన జ్ఞాపకాలే అన్ని భయాలకు, అశాంతికి కారణం. చీకట్లో వెళ్తున్నప్పుడు "దెయ్యం" అనే జ్ఞాపకం లేదా భావన లేకపోతే భయం ఉండదు. కానీ ఆ జ్ఞాపకం రాగానే పాత భయాలన్నీ చుట్టుముడతాయి. అలాగే ఆధ్యాత్మిక సాధనలో కూడా "నాకు ఆత్మజ్ఞానం కలగలేదు, నేను సాధన చేయాలి, నాకు ఫలానా అనుభవం కావాలి" అని జ్ఞాపకం చేసే నాటకమే అజ్ఞానం. సాధకుడు వర్తమానంలో ఉన్నది ఉన్నట్లుగా, ఏ జ్ఞాపకపు స్పర్శ లేకుండా, ఏ ఆలోచనా ప్రమేయం లేకుండా గమనించినప్పుడు, ఉన్నది ఉన్నట్లుగా పూర్ణమవుతుంది. నచ్చింది కావాలనుకోవడం జ్ఞాపకం; కానీ ఉన్నదానిని ఉన్నట్లుగా స్వీకరిస్తే, అక్కడ నచ్చడం–నచ్చకపోవడం అనే కోరిక కూడా నశించి, ఉన్నది పూర్ణానుభవంగా మారుతుంది.

సద్గురు శ్రీ శివానంద భగవానులు సెలవిచ్చినట్లు, అనంతమైన చైతన్య ప్రవాహంలో వేలు పెట్టడం అంటే, ప్రవాహంగా సాగుతున్న చైతన్యంలో జ్ఞాపకం అనే "నేను"ను జొప్పించడమే. ఎప్పుడైతే బుద్ధి వృత్తిలో ఈ జ్ఞాపకం లేదా కోరిక ప్రవేశించదో, అప్పుడు ప్రతి అనుభవమూ ఆత్మానుభవమే అవుతుంది, ప్రతి ఒక్కరూ జీవన్ముక్తులే అవుతారు. ఆత్మకు సద్రూపము, చిద్రూపము, ఆనందరూపము అనే భేదాలు కూడా లేవు. ఆ భేదాలు లేకపోవడమే అమలము, నిర్మలము. జ్ఞాపకమే దీనిని సత్తు అని, చిత్తు అని, ఆనందమని లేదా ఇది జాగృతమని, స్వప్నమని, సుషుప్తి అని విభజించి అయోమయానికి గురిచేస్తోంది. మనం జ్ఞాపకం ఆడుతున్న ఈ క్రీడను, మాయను సరైన ఎరుకతో గమనించకపోతే, మన ఆధ్యాత్మిక ప్రయాణం అసలు మొదలు కూడా కాదు. పరమాత్మ కఠినుడు కాదు, సులభంగానే ఉన్నాడు; కానీ మనలోని కోరికలతో కూడిన జ్ఞాపకమే కఠినమైనది. ఈ సత్యాన్ని గ్రహించి, సద్గురువుల అడుగుజాడల్లో జ్ఞాపకపు వల నుంచి బయటపడి, ఎరుకతో వర్తమానంలో జీవించడమే సత్యమైన ఆత్మబోధ.

# భారం పోవటమే మనసు పోవటం

## శ్రీరమణభగవాన్ బోధనలపై శివశ్రీ రమణ గురుదేవుల విశ్లేషణ

భక్తి, శరణాగతి మరియు విచారణల యొక్క అంతిమలక్ష్యం మనస్సులో ఉన్న మేధోపరమైన భారాన్ని తొలిగించడమే. అసలు భారం అంటే వేరే ఏదీ కాదు, అది దుఃఖం మరియు ఆందోళనల రూపంలో ఉండే మనో వికారమే. మనసు అంటేనే 'తెలియడం' లేదా ఎరుక. ఈ ప్రపంచం తెలియడమే మనసు పుట్టడం, ప్రపంచం తెలియకపోతే మనసు ఉనికిలోనే ఉండదు. అయితే మనసు గురించి మనసుకు సరిగా తెలియకపోవడం వల్లే భారం అనేది పుడుతుంది. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థల ద్వారా ఈ సత్యాన్ని గ్రహించవచ్చు. నిద్రలో ప్రపంచమూ ఉండదు, పరమాత్మ అనుభవమూ ఉండదు, అక్కడ మనసూ ఉండదు. అంటే ప్రపంచం తెలియని స్థితిలో మనసు ఉండదు. అదేవిధంగా పరమాత్మను దర్శించేటప్పుడు కూడా మనసు అనేది ఉండదు అని తెలియడమే అసలైన జ్ఞాన దర్శనం. మనసు అనుభవాన్ని పొంది, అనుభూతి చెంది, జ్ఞాపకంగా మారుతుంది. ఈ జ్ఞాపకమే చైతన్య ప్రవాహంగా కొనసాగుతుంది. ఒక దృశ్యాన్ని చూస్తున్నప్పుడు మన దృష్టి దృశ్యం వైపు ఉంటే అది ఆలోచనగాను, అదే దృష్టి చూసే ఎరుక వైపు మరలితే అది ధ్యానంగాను లేదా జ్ఞానంగాను మారుతుంది.

మనసు యొక్క ప్రధాన లక్షణం ఏమిటంటే, అది ఒక విషయాన్ని ఎరిగిన తర్వాత కావాలని కోరుకోవడం లేదా వద్దని తిరస్కరించడం చేస్తుంది. ప్రతి అనుభవంలోనూ అనుకూలత, ప్రతికూలత అనే ద్వంద్వాలు ఉంటాయి. మనసు అనుకూలత ఉన్నప్పుడు ప్రశాంతంగా ఉన్నట్లు అనిపించినప్పటికీ, ప్రతికూలత ఎదురైనప్పుడు దాన్ని సంస్కరించాలని, బాగు చేయాలని లేదా మార్చాలని నిరంతరం ప్రయత్నిస్తుంది. ఈ సంస్కరించే ప్రయత్నమే మేధోపరమైన భారంగా, ఆందోళనగా మారుతుంది. ఆకాశానికి నిచ్చెన వేయడం ఎంత అసాధ్యమో, ప్రవాహంలో నీటిపై రాసిన అక్షరాలను సరిచేయడం ఎంత నిష్ప్రయోజనమో, జరిగిపోయిన లేదా జరగబోయే అనుభూతులను సూక్ష్మ స్థాయిలో సంస్కరించే ప్రయత్నం చేయడం కూడా అంతే నిష్ప్రయోజనం. ఆత్మజ్ఞానము లేదా అవగాహన పొందిన తర్వాత ఈ మేధోపరమైన భారం అంతా వ్యర్థమని, అసలు భారమే అవసరం లేదని

స్పష్టంగా తెలుస్తుంది. భారమే లేకపోతే అదే ఆత్మజ్ఞానంగా పరిణమిస్తుంది. జరగనున్నది జరగక మానదు, జరిగేదాన్ని ఎవరూ ఆపలేరు అనే సత్యాన్ని గ్రహించి నప్పుడు మేధోపరమైన పని మరియు భారం రెండూ తొలిగిపోతాయి. ఈ బోధను వివరించడానికి అనేక ఉదాహరణలను చెప్పుకోవచ్చు. సద్గురు శివానంద భగవానులు విఘ్నేశ్వర పూజ అంతరార్థాన్ని వివరిస్తూ, మన మేధస్సుకు భవిష్యత్తు తెలియదు కాబట్టి, మనం మేలు అనుకున్నది ఒకవేళ దోషయుక్తమైతే దానికి విఘ్నం కలిగించమని దేవుడిని ప్రార్థించడమే గణపతిపూజలోని నిజమైన శరణాగతి అని చెప్పారు. దీనివల్ల భవిష్యత్తులో దాన్ని సరిదిద్దుకునే మేధోభారం తప్పిపోతుంది. రైలులో ప్రయాణిస్తున్నప్పుడు మన తలపై ఉన్న మూటను కింద పెట్టకుండా మోస్తూ కూర్చోవడం ఎంత అవివేకమో, భగవంతుని లేదా గురువు యొక్క చైతన్యంలో ఉంటూ సంసార భారాలను మనమే మోస్తున్నామని అనుకోవడం కూడా అంతే మోతగా మిగులుతుంది. అలాగే రావణాసురుడు కైలాస పర్వతాన్ని, శ్రీకృష్ణుడు గోవర్ధన గిరిని, ఆంజనేయస్వామి సంజీవని పర్వతాన్ని మోశామని చెప్పగా, ఒక సంసారి తాను మోసే కుటుంబ భారం గురించి చెప్పగానే అదే అందరి కంటే ఎక్కువ అని భావించినట్లు ఒక సరదా కథ కూడా ఉంది. అయితే శ్రీకృష్ణుడు గోవర్ధన గిరిని చిటికెన వేలితో ఎత్తగలిగింది 'నేను' అనే అహంకారం లేకపోవడం వల్లే అని తెలుసుకోవాలి. నాది, నేను అనే భావాలు, సంస్కరించాలి అనే అపార్థమే మనసుపై పెద్ద భారం. కాలం యొక్క పరమార్థాన్ని పరిశీలిస్తే, భూత, వర్తమాన, భవిష్యత్తులు అనేవి ఎరుక అనే తెర మీద ఏర్పడే వికారాలు మాత్రమే. గతంలోనూ, వర్తమానంలోనూ, భవిష్యత్తులోనూ ఉన్నది ఒకే పరమాత్మ ఎరుక. వర్తమాన క్షణంలో పరమాత్మ యొక్క లీలలను గమనించకపోవడమే ఆధ్యాత్మిక భారం. జ్ఞాని స్థితి థియేటర్ లోని సినిమా తెర వంటిది. ఆ తెరపై హారర్, సస్పెన్స్, క్రైమ్, కుటుంబ, హాస్య చిత్రాలు ఇలా ఎన్ని వస్తున్నా తెర ఏ విధమైన వికారానికి గురికాదు. అలాగే జ్ఞాని సమక్షంలో లేదా అతని జీవితంలో మహత్తులు జరగవచ్చు, ప్రమాదాలు జరగవచ్చు, కానీ జ్ఞానికి త్రివిధావస్థల యందు ఎరుక లేదా స్పృహ ఉండదు. ఏ స్పృహలో ఉండాలనే స్పృహ కూడా ఆయనకు ఉండదు. ఎటువంటి వీక్షణ గాని, కాంక్ష గాని లేని అద్భుతమైన చైతన్య ప్రవాహమే జ్ఞాని యొక్క స్థితి. మనసు, దేహం, చైతన్యం, వయోభారం వంటి సమస్త భారాలు అవగాహనతో, సద్గురు బోధల ద్వారా జ్ఞానంలో విలీనమైపోతాయి.

# ఆధ్యాత్మికతకు క్రమత.... క్రమశిక్షణ....అవసరమా?

**(శ్రీరమణభగవాన్, శ్రీజిడ్డుకృష్ణమూర్తి మరియు సద్గురు శ్రీశివానందమూర్తి భగవానుల బోధనల సమన్వయం)**

శ్రీ రమణులు చెప్పిన "అంతర్గత క్రమశిక్షణ విచారణ మార్గానికి అవసరం," అనే మాటలకు, అలాగే జిడ్డు కృష్ణమూర్తి గారు చెప్పిన "క్రమశిక్షణ మనిషిని బంధించి, మొద్దుబారేలా చేస్తుంది," అనే వ్యాఖ్యలకు మధ్య పరస్పర విరుద్ధత ఉన్నట్లు అనిపిస్తుంది. అయితే ఈ విరుద్ధత కేవలం ఉపరితల అవగాహనలోనే ఉంటుంది తప్ప, సూక్ష్మమైన విచారణతో చూస్తే వారిద్దరూ చెప్పినది ఒకే సత్యాన్ని అని స్పష్టమవుతుంది. ఆధ్యాత్మిక మార్గంలో సాధకుడిని లేదా భక్తుడిని 'డిసైపుల్' అంటారు. సద్గురు శివానందమూర్తి గారు "డిసిప్లిన్ లేనిదే డిసైపుల్ కాలేరు" అని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక సాధనలో నిగ్రహం, క్రమశిక్షణ లేకపోతే అంతర్గతమైన పరిపక్వత సిద్ధించదు. బాహ్య వ్యవహారాలలో క్రమశిక్షణ యొక్క ప్రాముఖ్యతను గమనిస్తే, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు లేదా ఏదైనా సభలు, సమావేశాలలో క్రమశిక్షణ లేకపోతే తోపులాట, తొక్కిసలాట, గందరగోళం మరియు హింస చోటుచేసుకుంటాయి. అదే క్రమశిక్షణ లేదా ఒక వరుస క్రమం ఉంటే అందరికీ కావలసినది ప్రశాంతంగా, ఇబ్బంది లేకుండా అందుతుంది. చివరికి ప్రకృతిలో ఎగిరే పక్షుల సమూహాన్ని లేదా ఆవుల మందను చూసినా ఒక నైసర్గికమైన క్రమత కనిపిస్తుంది. మానవులలో క్రమత లోపించినప్పుడు ఆరాటం, తొందరపాటు, నిర్లక్ష్య ధోరణి పెరిగి మనస్సు ప్రశాంతతను కోల్పోతుంది. అంతర్గత ఆధ్యాత్మిక మార్గంలో కూడా ఈ క్రమశిక్షణ యొక్క అవసరం అటువంటిదే. సత్య శోధనలో అన్వేషకుడికి నిర్ణయాలు, తీర్పులు, అభిప్రాయాలు తెరలాంటివి. ఉదాహరణకు ఒక సినిమాలో తెరలు రెండు రకాలుగా పనిచేస్తాయి. ఒక తెర చిత్రాన్ని చూపెట్టడానికి ఆధారంగా ఉంటే, మరొక తెర చిత్రాన్ని కనపడకుండా అడ్డుగా ఉంటుంది. అడ్డుగా ఉన్న తెరను తొలగించినప్పుడే ఆధారమైన తెరపై చిత్రాన్ని

## మధుర స్మృతులు



*2016 ఆగస్ట్ లో విజయవాడ లబ్బీపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో చాతుర్మాస్య దీక్షలో ఉన్న కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి శంకరాచార్య మహాస్వామి చేతుల మీదుగా శివశ్రీ రమణ గురుదేవుల అష్టావక్ర గ్రంధాన్ని ఆవిష్కరిస్తున్న శాసనసభ్యులు శ్రీరామ్ తాతయ్య.*

చూడగలం. ఇక్కడ అడ్డుగా ఉన్న తెరలు మన పూర్వజన్మ వాసనలు, అభిప్రాయాలు అయితే, ఆధారమైన తెర ఆత్మజ్ఞానం, ఎరుక. బాహ్య ప్రపంచాన్ని తెలుసుకోవడానికి ఎరుక యొక్క ప్రయాణంలో ఒక నిర్దిష్టమైన క్రమం ఉంటుంది. మన అనుభవం సిద్ధించే విధానాన్ని పరిశీలిస్తే: ఉనికి చైతన్యమై, చైతన్యం మనసై, మనసు అనుభవమై, అనుభూతిగా మారుతుంది. మెలుకువ రాగానే ఎరుక మొదట భావాన్ని తాకుతుంది, ఆపై దేహాన్ని, ఆపై ఆలోచనలను (మనస్సును), ఆ తర్వాత బాహ్య ప్రపంచాన్ని తాకుతుంది. ఎరుక జీవభావాన్ని తాకినప్పుడు జీవజ్ఞానము, దేహాన్ని తాకినప్పుడు దేహజ్ఞానము, ప్రపంచాన్ని తాకినప్పుడు ప్రపంచజ్ఞానము ఏర్పడతాయి. మన రోజువారి జీవనంలో కళ్ళు తెరవడం, ఎదురుగా ఉన్న వస్తువును చూడటం, అది ఏమిటో ఆలోచించడం, నిర్ణయానికి రావడం అనే క్రమం తప్పనిసరి.

ఉదాహరణకు ఒక మొబైల్ ఫోన్‌లో వీడియో రికార్డు చేసే ముందు ఫోన్ ఆన్ చేయడం, కెమెరా మోడ్ సెట్ చేయడం, స్విచ్ ఆన్ చేయడం అనే బాహ్య క్రమం ఉంటుంది. కానీ స్వయం సిద్ధమైన సత్యం లేదా ఆత్మ దర్శనం విషయానికి వస్తే, అక్కడ ఎరుకకు ఎటువంటి వరుస క్రమమూ ఉండదు. మెలుకువ వచ్చిన వెంటనే తాను ఉన్నాననే గ్రహింపు క్షణంలో కలుగుతుంది తప్ప, దానికి ఆలోచనలు లేదా నిర్ణయాలతో కూడిన వరుస క్రమం ఉండదు. ఎరుక, ఎరుగబడేది, ఎరిగినవాడు (ద్రష్ట, దృక్కు, దృశ్యము) అనేవి వేర్వేరు కాదు, మూడూ ఒక్కటే. మీరు ఒక సీసాని చూసినా, ఒక వ్యక్తిని చూసినా, గురువుని చూసినా మీ చూపు ఒక్కటే. చూసే విషయాలు వేరుగా ఉండవచ్చు కానీ చూసే చూపులో ఎటువంటి విడదీత లేదా క్రమత లేదు. చూపు లేకపోతే దృశ్యమే లేదు. అలాగే సినిమా చిత్రానికి సీన్ల క్రమం ఉంటుంది కానీ, ఆ చిత్రాన్ని మోసే వెనుక ఉన్న తెర (ఆధారము)కి ఎటువంటి క్రమమూ ఉండదు. ఎరుకకు, ఎరిగినవాడికి క్రమత లేదు, కానీ విషయాన్ని ఎరగడానికి, బాహ్య వ్యవహారానికి క్రమత అవసరం. జ్ఞానులు చెప్పిన అంతర్గత క్రమశిక్షణ అంటే చిత్తశుద్ధి. ఒక గదిని శుభ్రం చేసి సర్దినప్పుడు అక్కడ ఉన్న శుభ్రత స్పష్టంగా కనిపిస్తుంది. శుభ్రత అనేది ముందే ఉన్నప్పటికీ, అడ్డదిడ్డంగా ఉన్న వస్తువులను తొలగించడమనే క్రమశిక్షణ ద్వారా మాత్రమే అది వ్యక్తమవుతుంది. అలాగే ఔషధం సేవించి రోగాన్ని నివారించుకున్నాక ఆరోగ్యం వ్యక్తమవుతుంది. ఇక్కడ ఇహానికి (బాహ్య జీవితానికి) క్రమత అవసరం, కానీ పరానికి (ఆత్మజ్ఞానానికి) బాహ్య క్రమశిక్షణతో పనిలేదు, ఎందుకంటే ఎరుకే పరమాత్మ.

జేకే (కృష్ణమూర్తి) గారు విమర్శించిన క్రమశిక్షణ ఏమిటంటే -- ఆలోచనలను బలవంతంగా ఆపి, మనస్సును ఒకే ఆలోచనకు పరిమితం చేసి, లేదా మత్తు పదార్థాలు, వ్యాపకాల ద్వారా తాత్కాలిక శూన్యాన్ని తెచ్చుకోవడం. అటువంటి క్రమశిక్షణ మనస్సును మొద్దుబారేలా (అచేతనంగా) చేస్తుంది తప్ప సత్య అవగాహనను ఇవ్వదు. ఒక అభిప్రాయం, నిర్ణయం లేదా తీర్పుతో ధ్యానం చేస్తే,

ఆ అభిప్రాయాలే సత్య దర్శనానికి అడ్డుగోడలుగా మారుతాయి. దొంగను పట్టుకోవడానికి దొంగే “దొంగ దొంగ” అని అరిస్తే దొంగ దొరకనట్లే, మనస్సులోని అభిప్రాయాలతో మనస్సును తెలుసుకోవడం సాధ్యం కాదు. మనస్సును, దాని గుణాలను సూటిగా గమనించడమే అవగాహన. వివేకం లేని క్రమశిక్షణ గుడ్డిది. ఉదాహరణకు పది గొర్రెలు లేదా బాతులు వెళ్తుతున్నప్పుడు, మొదటి గొర్రె గోతిలో పడితే మిగిలినవన్నీ వివేకం లేకుండా దాంట్లోనే దూకుతాయి. అది కేవలం జడమైన క్రమశిక్షణ. కానీ హిమాలయాల్లో యోగులు మంచుపై నడిచేటప్పుడు చేతిలో కర్రతో నేలను గుచ్చి చూస్తూ (వివేకం ఉపయోగించి) అడుగులు వేస్తారు. ఇక్కడ వివేకము మరియు క్రమత కలిసి ఉంటాయి. వివేకంతో కూడిన క్రమశిక్షణే నిజమైన సాధన. ధ్యానము అంటే... ఎరుక, ఎరుగబడింది, ఎరిగినవాడు అనే మూడూ వేర్వేరు కాదని సంపూర్ణంగా అవగాహన చేసుకోవడమే. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన ‘స్థితప్రజ్ఞత’ అంటే సుఖదుఃఖాలలో క్రుంగుపొంగులు లేని స్థితి. ప్రపంచ విషయాలు సరిగ్గా అర్థమైనప్పుడు మాత్రమే ఈ స్థితప్రజ్ఞత సాధ్యమవుతుంది. సంపూర్ణమైన అవగాహనే క్రమశిక్షణ. అద్దం ముందుకు వెళ్ళినప్పుడు మన రూపాన్ని లేదా అద్దాన్ని చూడకుండా, అక్కడ ఉన్న ప్రత్యక్ష స్థితిని అభిప్రాయాలు లేకుండా చూడగలిగితే అది భ్రాంతిని తొలగిస్తుంది. అలాగే విగ్రహారాధన, నామజపం, పురాణ పఠనం వంటివి సాధనకు అడ్డుకావు, అలాగని అవే అంతిమము కావు. అవగాహన లేకుండా గుడ్డిగా చేస్తే అవి మొద్దుబారేలా చేస్తాయి, అదే వివేకంతో చేస్తే సత్య దర్శనానికి సహకరిస్తాయి. సద్గురు శివానందమూర్తిగారు చెప్పినట్లు సత్యం అనేది ‘పాత్‌లెస్ గోల్’ (దారి లేని గమ్యస్థానం). అక్కడ గమ్యము, గామి, గమనము అనే విభజన లేదు. భౌతికమైన సాధనల ద్వారా మొద్దుబారకుండా, స్వీయ విచారణ మరియు వివేకంతో కూడిన అవగాహన ద్వారా ఆత్మదర్శనం పొందడమే రమణులు, కృష్ణమూర్తిగారు మరియు శివానందమూర్తిగారు అందించిన బోధనల యొక్క అంతస్సూత్రం.

* * * * *

# వైరాగ్యము, చిత్తశుద్ధి మరియు ఆత్మవిచారము

**(సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానుల రుద్రభాష్య బోధనలపై శివశ్రీ రమణ గురుదేవుల విచారణ)**

**మా**నవ జీవితంలో ఈ జన్మలోనే, ఇప్పుడే వైరాగ్యం ప్రాప్తించినవాడే నిజమైన ధన్యుడు. వైరాగ్యం లభించిందంటే అతనికి అంతఃకరణ శుద్ధి లేదా చిత్తశుద్ధి కలిగిందని అర్థం. సమాజంలో వైరాగ్యము అనగానే ఇల్లు, వాకిలి, భార్యాపిల్లలు, ఉద్యోగాది బాధ్యతలను వదిలేసి ఎక్కడికో అడవులకు వెళ్ళిపోవడం అనే ఒక తప్పుడు అభిప్రాయం, భయం నెలకొని ఉన్నాయి. కానీ, సద్గురువులు వెల్లడించిన మూల సత్యం ఏమిటంటే-బాహ్య ప్రపంచాన్ని లేదా బాధ్యతలను త్యజించడం నిజమైన వైరాగ్యం కాదు. వైరాగ్యం అంటే "నేను ఎవరిని?" అనే ప్రశ్న యొక్క మూలాన్ని గ్రహించడం, ఆత్మవిచారం పూర్తయి స్వరూప జ్ఞానాన్ని పొందడమే. వ్యవహారిక సత్యంలో నిత్యానిత్య వస్తు వివేకంతో, ప్రపంచంతో సంబంధం కలిగి ఉంటూనే బంధం, మోహం, కర్తృత్వ భావనలు లేకుండా జీవించడమే వైరాగ్యానికి తొలి మెట్టు. పవిత్రమైన, వికారాలు లేని పరిశుద్ధ మనస్సే నిజమైన వైరాగ్యం. లౌకికము, పారలౌకికము అనే భేద భావాలను విడనాడి, రెండూ ఒకటే అని తెలుసుకోవడమే సత్య దర్శనం.

వైరాగ్యం పొందిన సాధకుడు దినచర్యలను, భౌతిక అవసరాలను త్యజించక్కర్లేదు. భౌతిక జగత్తును ప్రకాశింపజేసే సూర్యుడిని దినకరుడు అని అంటాం. కానీ ఈ దినాన్ని, అనుభవాలను తయారుచేసే ఎరుకే అసలైన "ఆత్మ సూర్యుడు". ఆ ఆత్మ సూర్యుడిని గ్రహించడమే సాధన. సాధనలో వైరాగ్య స్థితి సిద్ధించిన తర్వాత "నేను సాధకుడిగా ప్రత్యేకంగా ఏదీ చేయడం లేదు" అనే సత్యం అవగతమవుతుంది. అహంకారిక కర్తృత్వం నశించి, సంపూర్ణ శరణాగతి ప్రాప్తించినప్పుడు, సమస్త కార్యాలు సాధకుడి ద్వారా సహజంగా జరిపించబడతాయి. అప్పుడు "నేను ఏమి



చేయడం లేదు" అని అనుభవపూర్వకంగా తెలుస్తుంది. వైరాగ్యం అంటే పరిపూర్ణ జ్ఞానమే తప్ప, అసంపూర్ణమైన తృణీకారమో, జీవనం పట్ల ఏహ్య భావమో, బాధ్యతల నుండి పారిపోవడమో కాదు. కోరిక లేదా ఆకాంక్ష ఉన్న చోట విభజన ఏర్పడి, అది ఆందోళనకు కారణమవుతుంది. మనం సుషుప్తి (నిద్ర) స్థితిలో ప్రపంచాన్ని, దేహాన్ని, విషయ జ్ఞానాన్ని మరిచిపోవడం వల్ల మనస్సు లేక ప్రశాంతతను అనుభవిస్తున్నాం. మెలకువ రాగానే దేహ, ప్రపంచ స్పృహతో పాటు మనస్సు

వ్యక్తమై అశాంతి మొదలవుతోంది. ఇక్కడ గ్రహించాల్సిన విషయమేమిటంటే, నిద్ర అనేది అప్రయత్నంగా తెలియకుండా వచ్చే స్థితి అయితే, సమాధి అనేది ప్రయత్నపూర్వకంగా విషయాలను మరచిపోయే స్థితి. కానీ సాధనకు పరమావధి విషయాలు తెలియకుండా పోవడం కాదు. ఎందుకంటే 'ఎరుక' అనేది జాగృత్, స్వప్న, సుషుప్తి అనే త్రివిధ అవస్థలకు నిత్య సాక్షిగా, తెర వలె నిరంతరం ఉంటూనే ఉంటుంది. పరమాత్మ స్వరూపమైన ఈ ఎరుకను తెలియకుండా చేసుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. సమాధి స్థితి నుండి లేదా నిద్ర నుండి బయటకు రాగానే భౌతిక అనుభవాలు, సుఖదుఃఖాలు మళ్ళీ ఎదురవుతాయి. కాబట్టి విషయాలు లేదా ప్రపంచం తెలియకుండా పోవడం ముఖ్యం కాదు; ఎరుక స్థానంలో ఉంటూనే విషయాల వల్ల బాధపడకుండా ఉండటమే నిజమైన సాధన, వైరాగ్యం.

సాధారణ మానవుడు అశాంతి నుండి తప్పించుకోవడానికి మత్తు పదార్థాలు, వ్యసనాలు, వినోదాలు, అధ్యయనం లేదా వివిధ వ్యాపకాల్లో మునిగిపోతుంటాడు. ఇవన్నీ మెలకువగా ఉంటూనే నిద్రపోవడం లాంటి తప్పించుకునే మార్గాలు (మత్తులు) మాత్రమే. మానవుడికి, పశుపక్షాదులకు ఉన్న ప్రధాన వ్యత్యాసం 'కోరిక' లేదా 'ఆకాంక్ష'. పశుపక్ష్యాదులు ఎలాంటి కోరికలు, భవిష్యత్ ఆకాంక్షలు లేకుండా సహజంగా జీవిస్తున్నాయి. కానీ మానవుడు కోరిక లేకపోతే జీవనం సాధ్యం కాదని, విజయాలు సాధించలేమని భ్రమిస్తున్నాడు. సూర్యుడికి పగలు-రాత్రి అనే భేదాలతో సంబంధం లేనట్లే, సముద్రానికి అలలతో సంబంధం లేనట్లే---జీవితానికి కోరికలతో ప్రాథమిక సంబంధం లేదు. కోరిక లేకపోయినా జీవితం ఉంటుంది, కానీ జీవితం లేకపోతే కోరికకు ఉనికి లేదు. కోరిక అనేది ఎరుక స్థానంలో ఏర్పడే అస్పష్టత లేదా మలినం. ఆ మలినమే అంతరంగంలో అశాంతిని, బాహ్య ప్రపంచంలో సమస్యలను కల్పిస్తోంది. లోపల అఖండ ఆనందం, వెలుపల సహజమైన సృష్టి క్రమం నిరంతరం వెలుగుతున్నాయి.

వైరాగ్యం మరియు చిత్తశుద్ధి సాధనకు అతి సూటియైన మార్గం 'విచారణ మార్గం'. విచారణ అంటే ఏదో శోకించడం, శోధించడం కాదు; ఒక మిత్రుడు

"మీ నాన్నగారు నీ గురించి విచారించారు" అంటే 'నిన్ను గుర్తుచేసుకున్నారు' అని అర్థం. అలాగే 'ఆత్మ విచారణ' అంటే ఆత్మ యొక్క నైజమైన ఆనందాన్ని, ప్రశాంత తను పదే పదే గుర్తుచేసుకోవడమే. ఆత్మ అనేది దేహంలోనో, హృదయంలోనో దాగి ఉన్న ఒకానొక దృశ్య పదార్థం కాదు. మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడమే ఆత్మ గుణాన్ని స్మరించడం. కర్తృత్వ భావమే (నేను చేస్తున్నాను అనే అహంకారమే) సమస్త కోరికలకు, ఆందోళనలకు మూలం. "నేను చూడాలి, తెలుసుకోవాలి, సాధించాలి, మార్చాలి, సమాధి పొందాలి" అని అనుకునేది ఈ 'కర్త' మాత్రమే. ఎరుక స్థానంలో కర్త ప్రవేశించినప్పుడు ఆకాంక్ష పుట్టి, కర్మ–క్రియలుగా విస్తరిస్తుంది. శాస్త్రాల ప్రకారం సమస్త గుణగణాలు, గుణదోషాలు చిత్తానికే చెందుతాయి గానీ జీవాత్మకు ఏ దోషమూ అంటదు. 'చిత్త ఏకాగ్రత' అంటే బలవంతంగా ఆలోచనలను ఆపి ఒకే దానిపై మనస్సును నిలపడం కాదు; వికారాలు, ఆందోళనలు లేని పసందైన ప్రసన్న స్థితియే చిత్తశుద్ధి. చిన్నపిల్లవాడు ఆటలాడుకునేటప్పుడు ప్రత్యేకంగా ఏకాగ్రతను అభ్యసించాల్సిన అవసరం లేనట్లే, మనస్సు పవిత్రంగా, స్పష్టంగా ఉన్నప్పుడు ప్రత్యేక ధ్యాన సాధనలతో పనిలేదు. కోరిక లేదా ఆకాంక్ష అనే మలినం (అద్దంపై మట్టిలా, అగ్నిపై పొగలా) ఉన్నప్పుడే చిత్తశుద్ధి లోపిస్తుంది. చిత్తశుద్ధి కలిగినప్పుడు పొందే సహజ స్థితియే ధ్యానం.

చిత్తం, అహంకారం, మనస్సు, బుద్ధి అనేవి వేర్వేరు భౌతిక పదార్థాలు కావు; గ్రహించే శక్తి అయిన 'ఎరుక'లో రజో–తమో గుణాలు ప్రవేశించినప్పుడు అది దోషభూయిష్టమైన చిత్తంగా పిలువబడుతుంది. ఈ వ్యత్యాసాలను, కర్త యొక్క స్వరూపాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడమే చిత్తశుద్ధి. బాహ్య విషయాలు, పరిసరాలు మనకు సుఖదుఃఖాలను ఇస్తున్నాయనుకోవడం అపార్థం.మనస్సు తనలోని అపార్థాల ద్వారానే స్వీయ దుఃఖాన్ని, స్వీయ సుఖాన్ని సృష్టించుకుంటుంది. ఎరుకలో ఎలాంటి గుణదోషాలు, ఆకాంక్షలు లేనప్పుడు శేషించే పవిత్ర స్థితియే పరమాత్మ స్వరూపం. ఈ అస్మిత (నేననే భావం) నశించి, చిత్తశుద్ధి సిద్ధించినప్పుడు సాధకుడు ఈ జీవితంలోనే పరిపూర్ణ వైరాగ్యాన్ని, స్వరూప జ్ఞానాన్ని పొంది ధన్యుడవుతాడు.



# ప్రయాసను తీసివేసే గురుపౌర్ణమి



## గురుపూర్ణిమ సందేశం (2026)

చీకట్లో వస్తువులు కనిపించక వెతుకులాడుతూ ప్రయాసపడే మనకు దీపకాంతి రాగానే ఒక్కసారిగా అన్ని దృశ్యమానమై ఆ ప్రయాస పోతుంది. జీవితంలోకి గురువు ప్రవేశించేది కూడా ఆ ప్రయాసను పోగొట్టడానికే. మనకు తెలిసిన జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలతో పాటు తెలియని ధ్యాన సమాధి తురీయావస్థలు ఉన్నాయి. మనసు తనకు తెలియని అవస్థలను తెలుసుకోవాలని ప్రయాసపడుతుంది. మనసు అంటేనే అవస్థ అదే ప్రయాస. ఏ ప్రయాస అయినా తెలుసుకుంటేనో ఎవరైనా తెలియజేస్తేనో పోతుంది. గురువు మనం వెతికే అవస్థల గురించి చెప్పరు. మనసు అంటే ఏమిటో తెలియజేసి ఆ అవస్థను పోగొడతారు. అది ఎలాంటిదంటే సూర్యుడు చుట్టూ తిరిగే చంద్రుడు ప్రకాశం కోసం ఏ ప్రయాసా పడడు. ఆ సంపర్కంలోనే సూర్యకాంతి చంద్రుని కాంతిగా ప్రకాశిస్తుంది. మన జీవితాల్లో గురువు కూడా అదే చేస్తారు.



మనంగా తెలుసుకునే ప్రయాసను పోగొట్టి సర్వం ఎరిగినవారుగా వారే మనకు తెలియ చేస్తారు. మనం చేయాల్సిందల్లా గురువు పై సంపూర్ణ విశ్వాసం శరణాగతి తదధీన వృత్తి కలిగి ఉంటే చాలు. అందుకే సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానులవారు అన్నీ అడగటం కంటే శాంతిని అడిగితే సరిపోతుంది అన్ని అందులోనే ఉంటాయి అని సెలవిస్తారు. గురువును ఆ ఒక్కటి అడిగితే ఏ సాధన ప్రయాసలు లేకుండా సత్యాన్ని తెలియజేసి శాంతిని ప్రసాదిస్తారు.

**అదే గురు పౌర్ణమి.**

మీ... గెంటేల వెంకట రమణ
శ్రీగురుధాం ధర్మక్షేత్రం, బలుసుపాడు